https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సార్థ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక






హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 283 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ మంగళవారం, ఆగస్టు,11, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-


### వివాదాల్లో 12 లక్షల గజాల భూమి..

# రంగంలోకి హైదరాబాద్ కలెక్టర్

**హైదరాబాద్ జిల్లాలో సగానికి పైగా ప్రభుత్వ భూములు కోర్టు కేసుల్లో.. దాదాపు 12 లక్షల గజాల స్థలంపై న్యాయపరమైన వివాదాలు భూ వివాదాలపై రంగంలోకి దిగిన కలెక్టర్ ప్రియాంక ఆలా**



**హైదరాబాద్,ఆగస్టు,10:**
రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లాలో ప్రభుత్వ భూముల వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా ప్రత్యేకంగా దృష్టి సారించారు. జిల్లాలోని ప్రభుత్వ భూముల్లో సగానికి పైగా కోర్టు కేసుల్లో చిక్కుకోవడంతో, ఈ అంశంపై ఆమె ఉన్నత స్థాయి సమీక్ష చేపట్టారు. ఈ వివాదాలకు సంబంధించిన పూర్తి వివరాలతో 2-3 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 21.74 లక్షల చదరపు గజాల ప్రభుత్వ భూమి ఉండగా,ఇందులో దాదాపు 12 లక్షల చదరపు గజాల స్థలం వివిధ కోర్టు కేసుల్లో ఉంది. మొత్తం 238 కేసుల్లో ఈ భూములు చిక్కుకున్నా యి. అత్యధికంగా షేక్‌పేట్ మండలంలో 50 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసుల తాజా పరిస్థితి, రెవెన్యూ శాఖ తరపున కౌంటర్లు సరిగా దాఖలు చేశారా? లేదా? అనే వివరాలను నివేదికలో పొం దు పరచాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఉద్దేశించిన 22ఏ సెక్షన్‌సామాన్యులకు గుదిబండగా మారింది. ప్రభుత్వ భూముల పక్కన ఉన్న ప్రైవేటు పట్టా భూములను కూడా పొరపాటున నిషేధిత జాబితా లో చేర్చడంతో, వాటి రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. దీంతో లక్షలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ సమస్య తీవ్రతను గుర్తించిన కలెక్టర్ ప్రియాంక,22ఏ సెక్షన్ అమలులో జరుగుతున్న పొరపాట్లపై కూడా ఆరా తీస్తున్నారు. అన్ని హక్కులు ఉన్న ప్రైవేటు భూములు నిషేధిత జాబితాలోకి ఎందుకు వెళ్లాయి, పొరపాటు ఎక్కడ జరిగిందనే అంశాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తమ ఆస్తులు 22ఏ జాబితాలో ఉన్నాయని తెలియడంతో అనేకమంది బాధితులు తహసీల్దార్, కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

# వర్షాల కోసం వరుణ యాగం..

**- తెలంగాణలో వర్షాల కోసం ప్రభుత్వం మహా వరుణ యాగం**
**- నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు**
**- ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు**
**- యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం..**



**నాగార్జున సాగర్,ఆగస్టు,10:**
రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా ఉండటం, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలోప్రభుత్వం ఈ యాగానికి శ్రీకారం చుట్టింది. ఉదయం నుంచి సాగిన ఈ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది రుత్విక్కులు, వేద పండితుల పర్యవేక్షణలో 11హోమ గుండాలతో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, కేవలం 145.65 టీఎంసీల మేర మాత్రమే నీరునిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 590అడుగులు కాగా, ప్రస్తుతం ఇదిసుమారు 518అడుగుల వద్దే కొనసాగుతోంది.



గత ఏడాది ఇదే సమయానికి జలాశయం నిండుకుండలా ఉందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు నిం డిఅన్నదాతల పంటలు పచ్చగా ఉండాలన్న సంకల్పంతో ఈ యా గం నిర్వహించినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్‌గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

# 'లోక్‌తంత్ర సేనానీ'లకు ఉచిత బస్సు ప్రయాణం, వైద్యం..

**- బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం ఎమర్జెన్సీ బాధితులకు**
**- నెల నెలా రూ.10,000 భత్యం**
**- ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం**
**'లోక్‌తంత్ర సేనానీ'లను సత్కరించిన సీఎం సువేందు అధికారి - సేనానీలు మరణిస్తే వారి జీవిత భాగస్వామికి ప్రయోజనాలు**




**కోల్‌కత్తా,ఆగస్టు,10:**
పశ్చిమ బెంగాల్‌లో 'లోక్‌తంత్ర సేనానీ'లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. వారికి నెల నెలా రూ.10,000 భత్యం, ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం,ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సాయం అందిస్తామని ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. ఆదివారం రాష్ట్ర సచివాలయం 'నబన్న'లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. 1975-77 మధ్య దేశంలో విధించిన అంతర్గత ఎమర్జెన్సీ సమయంలో 'ఎంఐఎస్ఏ', 'డీఐఆర్' వంటి చట్టాల కింద జైలుకు వెళ్లిన వారిని 'లోక్‌తంత్ర సేనానీ'లుగా గుర్తిస్తున్నారు. ఈ సందర్భంగా 325 మంది సేనానీలను సీఎం సువేందు అధికారి ఘనంగా సత్కరించారు. ప్రతి ఒక్కరికి రాగి పతకాన్ని బహూకరించారు. ఒకవేళ సన్మానం అందుకున్న వ్యక్తి జీవించి లేకపోతే, వారి భర్త లేదా భార్య ఈ ప్రయోజనాలను పొందుతారని సీఎం స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సీఎం సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ నాటి క్లిష్ట పరిస్థితులను గుర్తు చేసుకున్నారు.

"ఆ సమయంలో దేశ వ్యాప్తంగా లక్ష మందిని జైళ్లలో పెట్టారు. వారిలో కనీసం 5,000 మంది బెంగాల్‌లోనే ఉన్నారు. అప్పుడు జైలు చీకటిలో జీవితాలు గడి పిన వారి త్యాగాల వల్లే ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ వ్యవస్థ, ఓటు హక్కు కాపాడబడ్డాయి" అని ఆయన అన్నారు. అలాగే, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలను సీఎం స్మరించుకున్నారు. గతాన్ని ఉద్దేశిస్తూ, జాతీయవాదం, దేశభక్తి, సంప్రదాయ సంస్కృతిని చెరిపేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు.

ముఖర్జీ సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఆగస్టు 13న శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ కమిటీ ద్వారా శ్యామ ప్రసాద్ ముఖర్జీ సిద్ధాంతాలను, బెంగాల్ విభజనకు సంబంధించిన సరైన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చుతామని సీఎం తెలిపారు.

### ఇరాన్‌తో యుద్ధం..

# నిండుకుంటున్న అమెరికా ఆయుధాలు



**- పేట్రియాట్, థాడ్ వంటి కీలక క్షిపణుల కొరత తీవ్రంగా ఉందన్న మాజీ మంత్రి**

**న్యూఢిల్లీ,ఆగస్టు,10:**
ఇరాన్‌తో కొన్ని నెలలుగా కొనసాగుతున్న యుద్ధం కారణంగా అమెరికాలోకీలకమైన క్షిపణి నిరోధక వ్యవస్థలు (మిస్సైల్‌ఇంటర్‌సెప్టర్లు), ఇతర ఆయుధాల నిల్వలు గణనీయంగాతగ్గిపోయాయని అమెరికారక్షణ శాఖ మాజీ కార్యదర్శి మార్క్ ఎస్పర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయుధ నిల్వలను వేగంగా భర్తీ చేయలేకపోవడం, ఇతర ముప్పులను ఎదుర్కోవడంలో సైనిక సంసిద్ధతపై ఇది ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. ట్రంప్ హయాంలో రక్షణ మంత్రిగా పనిచేసిన ఎస్పర్,ఆదివారం 'ఏబీసీన్యూస్'తో మాట్లాడుతూ.. పేట్రియాట్,థాడ్ వంటి ఇంటర్‌సెప్టర్ల కొరత చాలా తీవ్రంగా ఉందని తెలిపారు. "ప్రచ్ఛన్న యుద్ధం ముగిశాక తీసుకున్న నిర్ణయాలు, ఆతర్వాత ఉక్రెయిన్‌కు ఆయుధాలు ఇవ్వడంతో ఈ పరిస్థితి మొదలైంది. గత ఆరు, ఏడు నెలలుగా ఇరాన్‌తో యుద్ధం వల్ల మన నిల్వలు మరింత తగ్గాయి" అని ఆయన వివరించారు. అమెరికా ఆయుధ నిల్వలు తగ్గడం చైనాకు తప్పుడు సంకేతాలు పంపుతుందని, ఇది తమ దేశ నిరోధక సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన చెందారు. క్షీణించిన నిల్వలను భర్తీ చేసేందుకు పెంటగాన్ అదనంగా 67 బిలియన్ డాలర్ల నిధులను కోరుతోంది. అయితే, ఇరాన్‌తో యుద్ధం ముగిసే వరకు అదనపు నిధులను వ్యతిరేకిస్తానని డెమొక్రాటిక్ సెనేటర్ క్రిస్ మర్ఫీ తెలిపారు. "మనం దాదాపు అన్ని ఇంటర్‌సెప్టర్లను, తొమాహాక్‌లను వాడేశాం. ఇది అమెరికాను ప్రమాదకర స్థితిలో ఉంచింది" అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, రిపబ్లికన్ సెనేటర్‌జిమ్ బ్యాంక్స్ ఇరాన్ విధానాలపై ట్రంప్‌ను సమర్థించారు. ఇరాన్ అణ్వా యుధం పొందకుండా నిరోధించడమే ట్రంప్ లక్ష్యమని అన్నారు. ఆయుధాల ఉత్పత్తిని వేగవంతం చేయాలని రక్షణ సంస్థలపై ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నప్పటికీ, దీనికి తక్షణ పరిష్కారం లేదని ఎస్పర్ స్పష్టంచేశారు. "ఒక పేట్రియాట్ క్షిపణిని నిర్మించడానికి రెండేళ్లు పడుతుంది. కాబట్టి ఇప్పుడు ఏ చర్యలు తీసుకున్నా స్వల్పకాలంలో ప్రయోజనం ఉండదు" అని ఆయన పేర్కొన్నారు. విమానాలు, క్రూయిజ్ క్షిపణులను అడ్డుకోవడానికి పేట్రియాట్, బాలిస్టిక్ క్షిపణులను తుది దశలో కూల్చివేయడానికి థాడ్ వ్యవస్థలు అమెరికా రక్షణకు కీలకం.

# బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత..

**- సురబ్ జిల్లాలో కర్ఫ్యూ, పలుచోట్ల ఆంక్షలు**
**- బలూచిస్థాన్‌లోని సురబ్ జిల్లాలో పాక్ అధికారుల కర్ఫ్యూ**
**- ఆగస్టు 15 వరకు రాత్రి 8 నుంచి . ఉదయం 9 వరకు ఆంక్షలు**
**- శాంతిభద్రతల సమస్యలే కారణమని ప్రభుత్వ ప్రకటన**
**- ఖుజ్దార్ జిల్లాలోనూ రాత్రిపూట మార్కెట్లు మూసివేత**



**ఖుజ్దార్,ఆగస్టు,10:**
పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సెంట్రల్ బలూచిస్థాన్‌లోని సురబ్ జిల్లాలో అధికారులు కర్ఫ్యూ విధించారు. అధికారిక ఉత్తర్వుల ప్రకారం.. ఆగస్టు 9 నుంచి 15వ తేదీ వరకు సురబ్ జిల్లాలో కర్ఫ్యూ అమల్లో ఉంటుంది. ప్రతిరోజూ రాత్రి 8గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు స్పష్టం చేశారు. భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తలెత్తే పరిణామాలకు సంబంధిత వ్యక్తులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇదే సమయంలో, పొరుగున ఉన్న ఖుజ్దార్ జిల్లాలోనూ కఠిన ఆంక్షలు అమలులోకి వచ్చాయి. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ప్రతిరోజూ రాత్రి 8 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు మార్కెట్లు, దుకాణాలు, హోటళ్లు సహాఅన్ని వాణిజ్య సముదాయాలను మూసివే యాలని జిల్లా యంత్రాంగం ఆదేశించింది. గత నెలలో సురబ్ జిల్లాకు చెందిన 19 ఏళ్ల కూలీ సయీద్ అహ్మద్‌ను ఐఎస్ఐ, ఫ్రాంటియర్ కార్ప్స్ సిబ్బంది బలవంతంగా తీసుకెళ్లారని బలూచ్ మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. అలాగే, ఆగస్టు 4న ఖుజ్దార్‌లో ఇనాయతుల్లా జట్టక్ అనే పౌరుడిని దుండగులు కాల్చి చంపారు. స్థానిక డెత్ స్క్వాడ్ సభ్యుల నుంచి త మకుప్రాణహాని ఉందని ఆయన కుమార్తె బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేసిన కొన్ని గంటల్లోనే ఈ హత్య జరగడం గమనార్హం. ఈ వరుస పరిణామాల నేపథ్యంలోనే అధికారులు తాజా ఆంక్షలు విధించారని బలూచ్ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

# పట్నా హైకోర్టు సీజేగా

### తెలుగు తేజం జస్టిస్ కామేశ్వరరావు!

**- సుప్రీంకోర్టు కొలీజియం నుంచి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు**
**- జస్టిస్ కామేశ్వరరావుది ఏపీలోని కోనసీమ జిల్లా**
**- మరో మూడు హైకోర్టులకు కూడా కొత్త సీజేల పేర్ల ప్రతిపాదన**
**- త్వరలో రాష్ట్రపతి ఆమోదం, కేంద్రం నుంచి ఉత్తర్వులు**



**పట్నా,ఆగస్టు,10:**
ఆంధ్రప్రదేశ్‌కు చెందిన న్యాయమూర్తి జస్టిస్ వల్లూరి కామేశ్వరరావుకు కీలక పదవి లభించనుంది. పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన పేరును సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిజస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం.. పలు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి తా జాగా కేంద్ర ప్రభుత్వానికి పలు సిఫారసులు పంపింది. కొలీజియం సిఫారసుల ప్రకారం.. జస్టిస్ కామేశ్వరరావుతో పాటు, బాంబే హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవీంద్ర విఠల్‌రావు ఘుగేను కలకత్తా హైకోర్టుకు,అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్‌చంద్ర త్రిపాఠిని బాంబే హైకోర్టుకు, పంజాబ్-హరియాణా హైకోర్టు తాత్కాలిక సీజేజస్టిస్‌అశ్వినీకుమార్ మిశ్రాను అదే హైకోర్టుకు పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తులుగా నియమించాలని ప్రతిపాదించింది.

ఈ సిఫారసులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన తర్వాత, కేంద్ర న్యాయ శాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేస్తుంది.

జస్టిస్ కామేశ్వరరావు 1965లో ఏపీలోని డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ కోనసీమజిల్లా అమలాపురంలో జన్మించారు. ఆయన స్వగ్రామం రాజోలు మండలం పొన్నమండ. తండ్రి ఉద్యోగరీత్యాఢిల్లీలో స్థిరపడటంతో, ఆయన విద్యాభ్యాసం, న్యాయవాద వృత్తి అక్కడే కొనసాగింది. 2013లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన, 2015లోశాశ్వత న్యాయమూర్తి అయ్యారు. గతంలోకర్ణాటక హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కూడా సేవలు అందించారు.

# ఈ దుర్యోధనుడు.. గొప్ప సైంటిస్ట్ కూడా..






ఈ ఫొటోలో దుర్యోధనుడి వేషధారణలో ఉన్న వ్యక్తి పేరు డాక్టర్ ఎక్కిరాల వెంకటనరసయ్య. ఈ గెటప్ చూసి ఈయన కేవలం ఆర్టిస్ట్ మాత్రమే అనుకుంటున్నారేమో. కాదు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన గొప్ప సైంటిస్ట్ కూడా. హైదరాబాద్‌లోని హబ్సిగూడలో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐఐసీటీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)లో ప్రధాన శాస్త్రవేత్త. రసాయనాల పరిశోధనలో 30 ఏళ్లకు పైగా విశేష అనుభవం కలిగిన ఈయన జీవితం యువతకు ఆదర్శం. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం బత్తులపల్లి గ్రామంలోని మధ్య తరగతి కుటుంబంలో పెద్దనరసయ్య, గురవమ్మ దంపతులకు 10 మంది సంతానంలో ఒకరిగా పుట్టిన వెంకటనరసయ్య బాల్యంలోనే తన ప్రతిభాపాటవాలతో అందరినీ మెప్పించేవారు. పాఠాలు చెప్పే గురువుల ప్రశంసలు పొందేవారు. కిరోసిన్ దీపాలు, లాంతర్లు తప్ప కరెంట్ వెలుగుల్లేని ఆ మారుమూల ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని మంచి మార్కులు సంపాదించేవారు. వెంకటనరసయ్య తెలివితేటలను చూసి ప్రతిఒక్కరూ ప్రోత్సహించేవారు. భవిష్యత్‌లో బాగా వృద్ధిలోకి వస్తాడంటూ మెచ్చుకునేవారు. ప్రాథమికోన్నత విద్య కోసం వెంకటనరసయ్య రోజూ ఉదయం, సాయంత్రం దాదాపు 15 కిలోమీటర్లకు పైగా నడిచి బడికి వెళ్లివచ్చేవారు. ఆయన పట్టుదలను చూసి స్థానికులు ముక్కున వేలేసుకునేవాళ్లు. కల్లూరు గవర్నమెంట్ స్కూల్లో పదో తరగతి, జూనియర్ కాలేజీలో ఇంటర్, ఖమ్మంలోని ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) ఉత్తీర్ణులై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఫిల్‌లో చేరారు. ఆ సమయంలోనే కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలోని ఐఐసీటీలో టెక్నికల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. అనంతరం పీహెచ్‌డీ చేసి అదే సంస్థలో టెక్నికల్ ఆఫీసర్, సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్, ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా ప్రమోషన్లు పొందారు. ఈ క్రమంలో పలుమార్లు తన ప్రత్యేకతలను చాటుకున్నారు. యంగ్ సైంటిస్ట్ అవార్డ్‌కి ఎంపికయ్యారు. ఐఐసీటీ లోగో రూపకల్పన పోటీలో గెలుపొందారు. రీసెర్చ్ గైడ్‌గా ఎంతో మంది పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహిస్తున్నారు. చిన్నతనంలో ప్రభుత్వ హాస్టల్‌లో పురుగుల అన్నం తిన్న వెంకటనరసయ్య పెద్దయ్యాక దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి గెస్ట్‌గా వెళ్లి గౌరవ మర్యాదలు పొందే స్థాయికి చేరారు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే గుణాన్ని వెంకటనరసయ్య అణువణువునా నింపుకున్నారు. మూలాలను మర్చిపోకూడదనే మానవీయ కోణాన్ని నిత్యం ప్రదర్శిస్తుంటారు. తనను నమ్ముకున్న కుటుంబాన్ని పైకి తెచ్చేందుకు త్యాగాలు చేయటానికి సైతం వెనకాడరు. కళాకారుడిగా దుర్యోధనుడి పాత్రను ఎక్కువగా ఇష్టపడే వెంకటనరసయ్య ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి తనకు చేతనైనంత సాయం చేయటంలో మాత్రం దానవీరశూర కర్ణుడని ఆయన అభిమానులు అంటుంటారు. సమాజం పట్ల వెంకటనరసయ్య నిబద్ధత చూపుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రైతులకు దాదాపు రూ.60 వేల కోట్ల రుణమాఫీ చేయడం, ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమల్లోకి రావటం, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ప్రైవేటీకరణ కాకుండా చూడటం తదితర అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వెంకటనరసయ్య ఇచ్చిన సలహాలు సూచనలు కీలక పాత్ర పోషించాయి. సహజంగా వచ్చిన జ్ఞానానికి తోడు శ్రమను నమ్ముకున్న వెంకటనరసయ్య రేయింబవళ్లు కష్టపడి కెరీర్‌లో అత్యున్నత స్థాయిని అందుకున్నారు. 2022లో అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ రూపొందించిన వరల్డ్ టాప్-2 పర్సెంట్ సైంటిస్ట్‌ల జాబితాలో చోటు సంపాదించారు. మరోవైపు.. స్టేజ్ ఆర్టిస్ట్‌గా అప్పుడప్పుడూ నాటక ప్రదర్శనలు ఇస్తుంటారు. పౌరాణిక పాత్రలంటే మక్కువ చూపుతారు. డైలాగ్ డెలివరీలో దిట్ట అనిపించుకున్నారు.

**- ఎక్కిరాల కొండల రావు, సీనియర్ జర్నలిస్ట్**

# తెలంగాణ బ్రాహ్మణ అస్తిత్వ భూమికగా బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక




డీ కే చాటింపు,(హైదరాబాద్): తెలంగాణ బ్రాహ్మణ అస్తిత్వ భూమికగా ఏర్పడిన తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే తెలంగాణ సమాజానికి విస్తృత సేవలు అందించాలి అనే ఆకాంక్షతో భారతదేశ చరిత్రలోనే ప్రప్రదమంగా ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా 1000 మంది సేవకులతో ఒక మెగా జంబో కమిటీని ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక 8 విభాగాలతో ప్రతి విభాగానికి 125 మంది నాయకులతో చాలా పటిష్టంగా ఏర్పడబోతుంది అని. తెలంగాణ బ్రాహ్మణ ఆధ్యాత్మిక వేదిక, తెలంగాణ బ్రాహ్మణ మేధో మండలి, తెలంగాణ బ్రాహ్మణ మహిళా సాధికారిక వేదిక, తెలంగాణ బ్రాహ్మణ యువ చైతన్య వేదిక, తెలంగాణ బ్రాహ్మణ రాజకీయ వేదిక, తెలంగాణ బ్రాహ్మణ ఎన్నారై సెల్, తెలంగాణ బ్రాహ్మణ సోషల్ మీడియా వారియర్స్ అని వీటన్నిటిని సమన్వయం చేసే వేదికగా తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక ఉంటుంది అని ఎనిమిది విభాగాలు తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదికకి పునాదులుగా ఉ ంటాయి అని తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక నాయకులు ప్రకటించారు. తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక ఒకరి క్రింద ఒకరు పని చేసే వ్యవస్థగా కాకుండా తెలంగాణ బ్రాహ్మణులు సబండ వర్గాలతో సమైక్యమై పనిచేసే వ్యవస్థగా ఉంటుందని అందుకని తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదికకి దీ-ళీతీఅవఅం అని క్యాప్షన్ పెట్టుకున్నాము అని. దాని అబ్రివేషన్ బి- ఫ్రెండ్స్ (బ్రాహ్మణ ఫర్ సోషల్ రీ ఇంజనీరింగ్ ఇంక్లూసివే ఎంపవర్మెంట్ నెటవర్క్స్ డెవలప్మెంట్ సిస్టమ్) గా ఉంటుందని తెలియజేశారు. తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక,తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులందరూ తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ వ్యవహారం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్కి చైర్మన్గా ఉండే వ్యక్తి న్యూట్రల్ గా ఉండాల్సింది పోయి బాస్ అనే ఒక ప్రైవేట్ ఆర్గనైజేషన్ కి చీఫ్ కోఆర్డినేటర్ గా ఉంటూ సంక్షేమ పరిషత్ ఆఫీసులో ప్రైవేటు ప్రెస్మీట్లో పెట్టడం అధికార దుర్వినియోగమని దీనిపైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ గారికి ఏమాత్రం కూడా గౌరవనీయకుండా ప్రైవేటు వ్యక్తులతో ప్రెస్ మీట్ పెట్టడం అనేది చాలా దుర్మార్గ చర్యగా అభివర్ణించారు.బాస్ అనే ఫ్యూడలిస్టు పోకడతో తెలంగాణ సమాజానికి దూరం చేస్తున్న వారే అయోధ్య రామాలయం విషయంలో ఎలాంటి పరిపక్వత లేకుండా ప్రెస్ మీట్ పెట్టి హిందూ సమాజానికి కూడా బ్రాహ్మణులను దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారు ఇది ఏమాత్రం తెలంగాణ భూమి పుత్రుడు ఊరుకోరని సనాతన ధర్మం పట్ల అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల పట్ల ఒక్క అడుగు కూడా వెనకకు వేయమని నేటి నుండి సబండ వర్గాలతో సమైక్యమై తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలో నెంబర్ వన్ ఉంచడమే తెలంగాణ బ్రాహ్మణ ఉ ద్యమకారుల వేదిక మరియు తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక ఉమ్మడి లక్ష్యమని ప్రకటించారు. తెలంగాణ సంక్షేమ పరిషత్ బాధ్యులను ప్రకటించి మూడు నెలలు అవుతున్నా కూడా విదేశీ విద్య చదువుకోడానికి వెళ్లిన విద్యార్థులకు సరైన న్యాయం జరగడం లేదు అని వెంటనే వారిని ప్రభుత్వం పెద్ద మనసుతో ఆదుకోవాలని కోరుకున్నారు. అలాగే పేద బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అలాగే హెల్త్ కార్డు విషయంలో మిగతా ప్రభుత్వ సంక్షేమ ఫలాల విషయంలో ప్రాతినిధ్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరారు.ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారులకు సరైన ప్రాతినిధ్యమిచ్చి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు నియామకాలు కేవలం తెలంగాణ భూమి మిత్రులతోనే తప్పకుండా జరగాలని దీనితోపాటు మిగతా నామినేటెడ్ పోస్టులలో వారికి సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ, పోచంపల్లి రమణారావు ,అక్కినేపల్లి,వేణుగోపాలరావు,గంప రామారావు, ఊర ప్రసాదరావు, గూడ రాజేశ్వరరావు,చకిలం నరసింహారావు,సావల్కర్ శ్రీధర్ రావు,నరసాపురం రవి కిరణ్, వింజమూరు మనోహర్రావు,గూడ జయరాం,చెన్నూరి లక్ష్మీ నరసింహారావు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి...

## అదుపులో 10 మంది, రూ.83,010 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం....

బెల్లంపల్లి (డీకే చాటింపు ) నెన్నెల పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నెగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐలు రమేష్, లచ్చన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని, రూ.83,010 నగదు, 52 పేకముక్కలు,8 మొబైల్ ఫోన్లు,ఒక హీరో గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహించినట్లు గుర్తించిన ఆర్గనైజర్ రాళ్లపేట శ్రీకాంత్‌తో పాటు శ్రీను, రాజ్‌కుమార్ పరారీలో ఉన్నారు.వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న నగదు, పేకముక్కలు, మొబైల్ ఫోన్లు,ద్విచక్ర వాహనంతో పాటు అదుపులోకి తీసుకున్న వ్యక్తులను తదుపరి చర్యల కోసం నెన్నెల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.



# మెయిన్ డ్రైనేజ్ పనులను పరిశీలించిన... చైర్ పర్సన్





క్యాతన్ పల్లి ( డీకే చాటింపు): క్యాతనపల్లి మున్సిపాలిటీ 17వ వార్డు విద్యానగర్ కాలనీ ప్రజలు తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారని చైర్ పర్సన్ దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి చైన్ జేసీబీ టెండర్ వేయించి డ్రైన్ పూడిక తీయించి డ్రైన్ పనులు చెయ్యాలని ఆదేశించగా సోమవారం చైన్ జేసీబీ ద్వారా పనులు ప్రారంభం కాగా అక్కడికి చేరుకొని ప్రజలతో కలిసి పనులను పరిశీలించారు. ప్రజలు వారి సంతోషాన్ని వ్యక్తపరిచి, అభినందనలు తెలిపారు. అదేవిధంగా రాజీవ్ చౌక్ ప్రాంతంలో డ్రైనేజ్ పనులను ప్రారంభశీ కాగా అక్కడి షాప్స్ యజమానులు వారి బాధను మరియు అసహనాన్ని చైర్ పర్సన్ తెలుపగా అక్కడికి వెళ్ళి పనులను పరిశీలించి, యజమానులతో మాట్లాడి వారికి నచ్చుజెప్పారు. డ్రైనేజ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఏఈ అశృత్ వర్క్ ఇన్స్పెక్టర్ అవినాష్ కి చెప్పడం జరిగింది. మున్సిపాలిటీ అభివృద్ధి పనుల సూపర్వైజర్ నీ పిలిచి పనులు ఆలస్యం కాకుండా వేగంగా చేయాలని అదేశించారు. ప్రజలకు మరియు వ్యాపార సంస్థల యజమానులకు ఇబ్బంది లేకుండా పనులు చేయాలని సూచించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని డ్రైనేజ్ పనులను పూర్తి చేస్తామని అన్నారు. 22 వార్డులలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చిన ప్రతి రోజు ఆఫీసులో అందుబాటులో ఉంటానని వారు వచ్చి విన్నవించుకుంటే వాటిని పరిశీలించి పనులు అయ్యేలా చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజారమేష్, మాజీ కౌన్సిలర్ రామిడి ఉమాదేవి సీనియర్ నాయకులు రామిడి కుమార్, లక్కిరెడ్డి బాపు రెడ్డి,రామిడి లక్ష్మీకాంత్, సదయ్య, అప్పాల రవి, వలబోజు రవీందర్,తిరుపతి, మాధురి ,భాను, సౌజన్య , దేవరకొండ లక్ష్మీ, బబ్బెర సునీత, మున్సిపాలిటీ ఏఈ ఆశ్రిత్, వర్క్ ఇన్స్పెక్టర్ అవినాష్, ప్రేమ్, కాంట్రాక్టర్ అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# వనదేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క

**- సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన**



తాడ్వాయి, ఆగస్టు 10(ప్రజాదర్బార్): ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క - సారలమ్మ వనదేవతలను రాష్ట్ర పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించి ఆలయ పీటీ బీమ్స్,క్యూలైన్లు,మీడియా టవర్లు, గ్రానైట్ పనులతో పాటు ఆలయ ప్రాంగణం వెనుక భాగంలో ఏర్పాటు చేయనున్న నూతన క్యూ లైన్ ఏర్పాటుకు అవసరమైన అంశాలను పరిశీలించారు. ఈవో కార్యాలయ పరిసరాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దేవి పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నఅఖిలభారత విశ్వకర్మ మహాసభ

## తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు,కాలనీ మాజీ అధ్యక్షులు కౌలే జగన్నాథం

ఎల్బీనగర్, ఆగష్టు 10 (డీకే చాటింపు) ఎల్బీనగర్ లో గల బి.ఎన్.రెడ్డి డివిజన్ నందు గల సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ కాలనీ లో ఉన్న శ్రీ దేవి పోచమ్మ అమ్మవారిని కుంకుమ అర్చనలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో అఖిలభారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాలనీ మాజీ అధ్యక్షులు కౌలే జగన్నాథం పోచమ్మ గుడి చైర్మన్ కె రాజశేఖర్ రెడ్డి సాగర్ కాంప్లెక్స్ కాలనీ ఫేస్ వన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు



# శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి తిరునక్షత్ర మహోత్సవాలు



రంగారెడ్డి, ఆగస్టు10, (డీకే చాటింపు) శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి 70వ తిరునక్షత్రం సందర్భంగా కామినేని హాస్పిటల్స్ వారి సౌజన్యంతో వికాస తరంగిణి నేతృత్వంలో మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ గ్రామం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ అహోబిల స్వామి వారు విచ్చేసి ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కె సుభాష్, వికాస తరంగిణి కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, కామినేని హాస్పిటల్ కో ఆర్డినేటర్ డాక్టర్ టి సురేందర్ తో కలిసి ప్రారంభించడం జరిగింది.అహోబిల స్వామి వారు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి తిరునక్షత్రం సందర్భంగా ప్రతిరోజు ఆయా గ్రామాలలో కామినేని వారి సౌజన్యంతో ఉచిత ఆరోగ్య శిబిరాలను అదేవిధంగా సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది అని తెలియజేశారు. స్వామివారి తిరు నక్షత్రం నాటికి వేల సంఖ్యలో మొక్కలు నాటే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి ఎగ్జిక్యూటివ్ భవానీ ప్రసాద్, డాక్టర్ శ్రీకృష్ణా సైంటిస్ట్, ఉప సర్పంచ్ కె పాండు, మాజీ సర్పంచులు పెంటయ్య, చంద్రయ్య గ్రామ పంచాయతీ సభ్యులు మాజీ సభ్యులు గ్రామ ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది స్వామి వారు మొక్కలు నాటడం జరిగింది అదేవిధంగా స్థానిక పాఠశాలలో ఇంకుడు గుంత నిర్మాణం కోసం కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ నిర్వహించడం జరిగింది. మెడికల్ క్యాంప్ లో పాల్గొన్న డాక్టర్స్ పి జాహ్నవి గైనకాలజిస్ట్, సంజనా రెడ్డి డెర్మటాలజీ, గోపిశంకర్ రెడ్డి ఆర్థోపెడిక్, రామ్ చరణ్ జనరల్ మెడిసిన్, ప్రేరణ జనరల్ సర్జన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పవన్, పి వేణు తదితరులు పాల్గొన్నారు.

# చిన్ననాటి స్నేహం.. కష్టకాలంలో ఆర్థిక భరోసా..!

**-మిత్రుడు దూరమైన కుటుంబానికి అండగా పూర్వ విద్యార్థులు... -స్నేహానికి చిరునామగా పూర్వ మిత్రులు...**

నారాయణపేట,(డీకే చాటింపు): చిన్ననాటి స్నేహం..!ఒకే తరగతి గదిలో చదువుకున్న అనుబంధం..!!కాలం గడిచినా చెదరని ఆత్మీయత..ఆపద సమయంలో ఆ స్నేహబంధం మరోసారి వెలుగుచూసింది. తమతో కలిసి చదువుకున్న బాల్యమిత్రుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం..అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు పూర్వ విద్యార్థులంతా ఒక్కటై మానవత్వాన్ని చాటుకున్నారు.వివరాలోకి వెళ్తే...నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన జీడి ప్రకాష్ గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ వారం రోజుల క్రితం మృతి చెందారు.ప్రకాష్ మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ఈ విషయాన్ని తెలుసుకున్న ఆయన చిన్ననాటి మిత్రులు, పూర్వ విద్యార్థులు సోమవారం జాజాపూర్ గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ప్రకాష్‌తో తమకున్న చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి తమ వంతుగా కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలుస్తామని, ఎలాంటి అవసరం వచ్చినా తమకు తెలియజేయాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.స్నేహం అంటే సంతోషాల్లోనే కాదు.. కష్టాల్లోనూ తోడుగా నిలవడమేనని పూర్వ విద్యార్థులు తమ చర్య ద్వారా చాటిచెప్పారు. ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి ఆర్థికంగా, మానసికంగా అండగా నిలిచిన పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా గ్రామస్థులు అభినందించారు.



డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
మంగళవారం, ఆగస్టు,11, 2026

# విద్యుత్ సంస్థలపై ప్రయివేటు పడగ..?

ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయివేటీకరణ విధానాల నీడ మరింత ముసురుతోంది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కీలక విభాగాలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే చర్యలు, 'రైతు డిస్కం' ఏర్పాటు ప్రయత్నాలు, మరోవైపు కేంద్రం తీసుకొచ్చిన 2025 విద్యుత్ సవరణ బిల్లు కలిసి తెలంగాణ విద్యుత్ రంగ భవిష్యత్తుపై ఆందోళనలు పెంచుతున్నాయి. ప్రధాని మోడీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన విద్యుత్ సవరణ బిల్లు ఆమోదం పొందితే విద్యుత్ రంగం పూర్తిగా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదముంది. ఇప్పటికే తెలంగాణ విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చాలా వేగంగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఇది గమనించిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్లు జేఏసీగా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా గత పది రోజులుగా నిరసన తెలుపుతున్నారు. విద్యుత్ రంగ సంస్థలు ప్రయివేటీకరణ కాకుండా అడ్డు కుంటేనే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. రాష్ట్రంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని స్టేజ్ 1, 2 యూనిట్లకు సంబంధించి కూల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్, ఆపరేషన్ మెయింటెనెన్స్, మెకానికల్ ఎలక్ట్రికల్ పనులను ప్రయివేటు సంస్థకు అప్పగించేందుకు జెన్కో టెండర్లు పిలిచింది. ఈ జనవరి నుంచి ఇప్పటివరకు పరిణామాలను చూస్తే.. 'రైతు పవర్ విస్కం' పేరుతో ఒక కొత్త డిస్కం ఏర్పాటు చేయడానికి కావాల్సినవి సిద్ధం చేసుకుని, వీటి లైసెన్స్ కోసం ఈఆర్సీలో బహిరంగంగా విచారణ కూడా పూర్తిచేసింది. ఇక లైసెన్స్ ఇవ్వడం ఆలస్యంగా మారిం దంటూ రైతు డిస్కం, ఇటు వైటీపీఎస్‌లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 2003 విద్యుత్ చట్టంలో భాగంగా మన విద్యుత్ సంస్థలు ప్రయివేటీకరణ అనివార్యం అయిపోయింది. ఈ ప్లాంట్ నిర్మించి ఏడాది కాకముందే ప్రయివేటీకరణ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. 2025 ఆగస్టులో ఉత్పత్తి ప్రారంభించిన ఈ సంస్థ మన డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క గత ఆగస్టు నెలలో జాతికి అంకితం చేశారు. 2,800 ఎకరాల్లో నిర్మించిన పవర్ ప్లాంట్ దేశంలోనే అతి పెద్ద పవర్ ప్లాంట్‌లో రెండవది. అత్యధికంగా గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాలను ప్రభుత్వం ఆక్రమించి అటవీ భూములతో పాటు రైతులు తమ భూములు, ఇండ్లను కూడా కోల్పోయి భూములిచ్చారు. దాంతో సుమారు రూ.30 నుంచి 35 వేల కోట్లతో నిర్మించిన ఈ ప్లాంట్ ఏడాది తిరగకముందే స్టేజీ 1, 2 లను ప్రయివేటు కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతుంది. ఈ ప్లాంట్ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతు కుటుంబ సభ్యులకు, ఇండ్లు కోల్పోయిన పేదలకు పూర్తిస్థాయిలో ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. జెన్కో నిర్మాణం కోసం భూములిస్తే సర్కారు నౌకరి వస్తుందని ఆశతో ఖరీదైన భూములను త్యాగం చేశారు. ప్రస్తుతానికి ప్రయివేట్‌కి ఇవ్వడానికి రంగం సిద్ధం చేసింది. దీనిని ఐక్యంగా ఎదుర్కోలేకపోతే మిగిలిన 3, 4, 5 స్టేజీలు కూడా టెండర్లు పిలిచే అవకాశం ఉంది. అలాగే 2014 సంవత్సరంలో ఎన్డీఏ నాయకత్వంలో మోడీ.. ప్రధానమంత్రి అయినప్పటి నుంచి స్వదేశీ పెట్టుబడిదారుల కన్ను విద్యుత్ సంస్థలపై పడింది. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తయారైన 2003 విద్యుత్ చట్టంలోని ప్రయివేట్ పెట్టుబడుదాలకు కావాల్సినన్ని ప్రయోజనాలు కల్పించారు. అయినప్పటికీ పెట్టుబడిదారులకు సంతృప్తి కలుగలేదు. అనేక సవరణలతో విద్యుత్ సంస్థలను వాడుకొని అధిక లాభాలు సంపాదించాలనే కోరిక పెట్టుబడిదారులకు ఉన్నట్టు తెలుస్తుంది. ఉదాహరణకు బీఎస్ఎన్ఎల్ టవర్లపై రిలయన్స్ నెట్‌వర్క్ మాదిరిగా మన నెట్‌వర్క్‌ను వాడుకొని కేవలం బిల్లింగ్ చార్జీలు మాత్రమే విద్యుత్ సంస్థ లకు చెల్లిస్తారు. ఉదయ్ ఆదిత్య, ఆర్డీఎస్ఎస్ అనే పేర్లతో కొత్త కొత్త ప్రతిపా దనలు ముందుకు తెస్తూ రాష్ట్ర డిస్కమ్‌లకు ఆర్థిక సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ప్రలోభాలకు గురిచేస్తుంది. కేంద్ర ప్రభుత్వం చేసే ప్రయత్నాలను వ్యతిరేకించకుండా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం ఆదేశాలను ఆచరణలో పెడుతోంది. దీనిలో భాగమే మన తెలంగాణ రైతు డిస్కం, వైటీపీఎస్ స్టేజీ 1, 2లో జరిగే ప్రయివేటీకరణ ప్రయత్నాలు. కేంద్ర ప్రభుత్వం చేసే ప్రయో గాలతో రాబోయే ఐదేండ్లల్లో సబ్సిడీలు, క్రాస్ సబ్సిడీలు పూర్తిగా రద్దు చేయాలని కూడా 2025 విద్యుత్ సవరణ బిల్లులో స్పష్టంగా ఉన్నాయి.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారథ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

## జై జవాన్ ఆగ్రో ఫార్మింగ్ సెంటర్లో

# సైనికులు ,రైతులకు సన్మానం





నిజామాబాద్ ఆగస్ట్ 10(డీ కే చాటింపు): దేశ సేవలో సైనికులు చేస్తున్న కృషి తో పాటు గ్రామాల్లో కూడా క్రమ శిక్షణకు మారు పేరుగా నిలుస్తున్న చిరువేణి నవీన్ కుమార్ సేవలు అమోఘం అని బోధన్ డివిజన్ ఏడాపల్లి మండల వడ్డేపల్లి సర్పంచ్ కోమటి సత్యం కొనియాడారు. సైన్యంలో నవీన్ కుమార్ లెఫ్టినెంట్ కల్నల్ మేజర్ గా పనిచేసి రిటైర్ అయినా కూడా సేంద్రీయ వ్యవసాయం చేయడం అభినందనీయం అన్నారు. తాటి మణెమ్మ రాములు ఫౌండేషన్ ద్వారా వడ్డేపల్లి సైనికులకు,ఆదర్శ రైతులకు ఘన సన్మానం చేశారు. నేటి యువ రైతులకు నవీన్ కుమార్ ఆదర్శంగా ఉ న్నారని ఫౌండేషన్ చైర్మన్ తాటి వీరేశం అన్నారు. ఆదర్శ మహిళా రైతుగా చిరువేణి పుష్ప సేవలు కూడా స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ రోజు 100 వ సన్మానం పూర్తి అయ్యింద న్నారు . సేంద్రీయ వ్యవసాయం తో పాటు ,సోలార్ డ్రైయార్, జీవామృతం, గోబర్ గ్యాస్, అనారోబిక్ కంపోస్టు తయారు చేస్తూ గ్రామంలో అవగాహనకల్పిస్తున్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ ఫిరోజ్ ,ఫౌండేషన్ నుండి అశోక్ కుమార్ సత్యనారాయణ, సోషల్ వర్కర్లువితల్,గంగాధర్, డ్వాక్రా మహిళా లీడర్లు భూ లావణ్య,నర్మదా,స్వరూప అక్షయ,షబానా ,రైతులు రవి,మహబూబ్,సందీప్, భూమయ్య,దుర్గా మానస,శ్యాం,మనోహర్ , లక్ష్మణ్, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి రామ్ గోపాల్ తదితర రైతులు పాల్గొన్నారు.

# వికలాంగుల సమస్యల పరిష్కారానికి వికలాంగుల హక్కుల జాతీయ వేదిక పోరాటం

నిజామాబాద్ ఆగస్ట్ 10(డీ కే చాటింపు): వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వరకు పోరాటాలు నిర్వహిస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ తెలిపారు. ఆదివారం ఉమ్మడి కోటగిరి, పోతంగల్ మండలాల పరిధిలోని సోంపూర్ గ్రామంలో చీూ=ణ జిల్లా అధ్యక్షుడు గైని రాములు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంగాధర్ మాట్లాడారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో హనుమాన్ మందిరం, మార్కండేయ మందిరం సమీపంలోని రాకాసిపేట్ గ్రామ అభివృద్ధి కమిటీ ఫంక్షన్ హాల్‌లో చీూ=ణ నిజామాబాద్ జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బసవరాజ్ పాటిల్, నిజామాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ.రమేష్‌బాబు హాజరవుతారని పేర్కొన్నారు. సదస్సులో వికలాంగులకు సంబంధించిన చట్టాలు, సంక్షేమ పథకాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ప్రభుత్వాలు వృద్ధులు, ఒంటరి మహిళలు




తదితరులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కోటగిరి, పోతంగల్ నుంచి పెద్ద సంఖ్యలో హాజరై జిల్లా సదస్సును విజయవంతం చేయాలని గంగాధర్ పిలుపునిచ్చారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాల మేరకు సమస్యలు పరిష్కారమయ్యే వరకు దశలవారీగా పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గైని రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు దేవదాస్,బ మేత్రి చిన్న గంగారం, శరత్ పవర్, నగేష్, మహేష్, సిద్ధ పూలే గంగాసాగర్, సావిత్రి, హనుమంత్‌రావు పవర్, గంగారం పటేల్, గంగా బాజీరావు, సిందే గంగారాం పటేల్, మహేష్, సాయిలు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు

# రఘునాథ ఆలయం లో సీతారాముల కళ్యాణం





నిజామాబాద్ ఆగస్టు10(డీ కే చాటింపు): రఘునాథ ఆలయం, ఖిల్లా రామ మందిరంలో, పునర్వసు నక్షత్రం సందర్భంగా సోమవారం సామూహికంగా 72 జంటలు కళ్యాణంలోపాల్గొన్నారు.అతి ప్రాచీన ఆలయం అభివృద్ధి కి నగర ప్రజలు విశేషంగా కృషి చేస్తున్నారు.సీత రాముల కళ్యాణంనానిపంతులు,సందీప్ , ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ గురు వినయ్ ,గౌరవ అధ్యక్షులు ముక్క దేవేందర్ , జీ ఆర్ ఎంటర్ ప్రైజ్ అధినేత రాజశేఖర్ ,పూర్ణచందర్,ప్రభాకర్, అశోక్ ,తాటి వీరేశం, పెంటయ్యసార్ పోలవీరేందర్, గజవాడధర్మరాజు ,మాజీ కౌన్సిలర్అంబదాస్,రాఘవులు, చిటిమిల్ల హరిప్రసాద్ కొండాహన్మండ్లు, సంజీవరావు ,గంగాధర్, ప్రవీణ్,గాలి నాగరాజు,డాక్టర్ వాణి, ధన్పాల్ నారాయణ, బెల్దే వాసుతదితరదంపతులు కళ్యాణం పాల్గొన్నారు.శ్రీ రఘునాథ ఆలయ వాలంటీర్లు , చల్ల గంగాధర్, విఠల్,అశోక్,పోషెట్టి, శివ లక్ష్మీ,సాధన , శరత్ చంద్ర,రమేష్ ,మాణిక్యం ,రమణ,ట్రస్టు సభ్యుల అన్నదానం నిర్వహించారు.

# ఇందూరు లో ఆషాఢమాస బోనాల సందడి




నిజామాబాద్ విలేకరి ఆగస్టు 10(డీ కే చాటింపు): నిజామాబాద్ (ఇందూరు) లో ఆషాఢమాసం చివరి ఆదివారం బోనాల సందడి జోరుగా సాగింది. న్యాల్కల్ రోడ్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.నల్ల పోచమ్మ, దేవి మందిరంలలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అంబేద్కర్ కాలనీ యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవం ఘనంగా జరిపామని డాక్టర్ సత్యం చెప్పారు. పి ఎం పి అసోసియేషన్ అధ్యక్షుడు పులగం మోహన్, మహిళ సభ్యులు రజిత,భార్గవి కాలనీ వాసులు పాల్గొన్నారు.

రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో పాడిపంట బాగుండాలని బోనమెత్తినట్లు గ్రామస్తులు తెలిపారు .చిక్కడపల్లి లో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహిం చారు ఉదయం పోచమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి అనంతరం మధ్యాహ్నం చిన్న పెద్ద అందరు కలిసి భక్తిశ్రద్ధలతో భాజ భజంత్రీల మధ్య గ్రామంలోని మహిళలు నెత్తిన బోనమెత్తి పోచమ్మ తల్లికి సమర్పించారుగ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండా లని తల్లిని వేడుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుర్మరాజు, కార్యదర్శి గోపి, సలహాదారులు రాజయ్య, ఎతీ.



మల్లేష్,కోశాధికారి జెల్లపరమేష్ సభ్యులు కృష్ణార్జున్, కోలా శ్రీను, కొందరు అంజయ్య, సాయినాథ్, మాజీ సర్పంచ్ పుష్పలత రమేష్, పెద్ద హన్మంతు, గుడిసె హన్మంతు, జెల్ల సాయిలు, రవి, బస్వయ్య, అశోక్ తదితరులు, గ్రామస్తులు మహిళలు ఉన్నారు.

# గాంధీ గశీజ్ లో సెల్ ఫోన్ దొంగలు ,బాధితుల మొర

నిజామాబాద్ ఆగస్ట్ 10(డీ కే చాటింపు): నిజామాబాద్ నగరం గాంధీ గశీజ్ లో సెల్ ఫోన్ దొంగలతో బాధితులు లబో దిబో మంటూ వన్ టౌన్ పోలీసులకు మొర పెట్టు కొంటున్నారు.గాంధీ గశీజ్ లో కూరగాయల మార్కెట్ లో కాయగూరలు కొంటుండగా గమనించి సెల్ ఫోన్ లను దొంగలు కొట్టేస్తున్నారని బాధితులు గణేష్,సత్యం తదితరులు వాపోయారు.ప్రతి రోజు సెల్ ఫోన్ బాధితులు 1 వ టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేస్తున్నారు. సెల్ ఫోన్ దొంగలను పట్టుకొని ఫోన్లు ఇప్పించాలని పోలీసులను బాధితులు వేడుకుంటున్నారు.

# బెల్లంపల్లి 1 టౌన్ ఎస్సైగా రామకృష్ణారావు బాధ్యతల స్వీకరణ....




బెల్లంపల్లి (డీకే చాటింపు ) పట్టణ 1 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా డి. రామకృష్ణరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన 1 టౌన్ సిఐ కె. శ్రీనివాసరావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే పరిష్కరించాలని, నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బెల్లంపల్లి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నూతన ఎస్సై మాట్లాడుతూ.తనకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా, క్రమశిక్షణతో నిర్వర్తిస్తానని, లిప్రజలకు సేవ చేస్తానని, బెల్లంపల్లిలో శాంతిభద్రతలను కాపాడతానని అన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో ఉపయోగం: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, ఆగష్టు 10 (డీకే చాటింపు) బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని ఎస్.కె.డి.నందు నివాసం ఉండే ప్రసాద్ ఊపిరితిత్తులకు సంబందించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి యొక్క కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి వారి చికిత్సకు అవసరమైన వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా దరఖాస్తు చేయించారు.దానికి గాను రూ.2,60,000 (రెండు లక్షల అరవై వేల రూపాయలు) ఎల్.ఓ.సీ. ( ఎల్ ఓ సి ) మంజూరు కాగా ఆ చెక్కును బాధిత భార్య ధనలక్ష్మి కి అందజేశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందన్నారు.అనంతరం బాధిత భార్య మాట్లాడుతూ మా వారి ఆరోగ్య సమస్య విషయంలో సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.చికిత్స కోసం చెక్కు అందించడంలో ఆయన చూపిన మద్దతు జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భారస నాయకులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,,మంద రాజశేఖర్ రెడ్డి,నితీష్ తదితరులు పాల్గొన్నారు.

# శారదానగర్‌లో అమ్మవారి ఘటం ఊరేగింపులో పాల్గొన్న - బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

ఎల్బీనగర్,ఆగస్టు 10 (డీకే చాటింపు )గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని శారదానగర్ కాలనీ చౌరస్తాలో సాయి యాదవ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమంలో బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్, బీజేపీ నాయకులు సందీప్, రవి, సంతు, వినయ్, వంశీ, టీంకు, రఘునందన్ జోషి, శశాంక్, రాహుల్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యకారులకు ప్రమాద బీమా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం

## -4.21 లక్షలకు పైగా సభ్యులకు లబ్ధి- ప్రమాదంలో మరణించినా, వికలాంగులైనా.. - రూ.5 లక్షల వరకు ఆర్థిక రక్షణ:మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి



ఎక్కిరాల కొండల రావు, హైదరాబాద్ సచివాలయ ప్రతినిధి (డీకే చాటింపు) తెలంగాణలో 2026–27 ఆర్థిక సంవత్సరంలో 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకాన్ని(+ూxూ) అమలుచేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల సభ్యులు ప్రమాదవశాత్తూ మరణించినా లేదా శాశ్వత వైకల్యానికి గురైనా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది. 18 నుంచి 70 ఏళ్ల లోపు వయసున్న నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారు. ఒక్కో లబ్ధిదారుడికి రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.21,34,79,673 చెల్లిస్తుంది.

బీమా పథకం ప్రయోజనాలు

ప్రమాదంలో చనిపోయినా, శాశ్వత సంపూర్ణ వైకల్యానికి గురైనా రూ.5 లక్షలు, శాశ్వత పాక్షిక వైకల్యానికి గురైతే రూ.2.50 లక్షలు, ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందితే గరిష్ఠంగా రూ.25 వేల వరకు వైద్య సహాయం అందిస్తారు. ఈ పాలసీ ఈ ఏడాది జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

# ఘనంగా బీఆర్ఎస్ చైతన్యపురి డివిజన్ అధ్యక్షులు తోట యాదవ్  జన్మదిన వేడుకలు

### పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు





ఎల్బీనగర్, ఆగష్టు 10 (డీకే చాటింపు) యువత గుండె చప్పుడు, నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న డైనమిక్ లీడర్, బీ.ఆర్.ఎస్. పార్టీ రాష్ట్ర యువ నాయకులు, చైతన్యపురి డివిజన్  ముద్దు బిడ్డహొహొ తోట మహేష్ యాదవ్ జన్మదిన వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆగస్టు 10వ తేదీన ఆయన పుట్టినరోజు సందర్భంగా  రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలోని ప్రతి వాడ, ప్రతి గల్లీ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. అభిమానులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు డివిజన్ నలుమూలల గులాబీ శోభను అద్దాయి. రాజకీయాల్లోకి వచ్చిన అనతికాలంలోనే తనదైన సేవా దృక్పథంతో, కలుపుగోలుతనంతో తోట మహేష్ యాదవ్ ఎనలేని క్రేజ్ సంపాదించుకున్నారు. ఉదయం నుంచే తోట మహేష్  యాదవ్ నివాసం వద్ద కోలాహలం మొదలైంది. ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు వేలాది మంది అభిమానులు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా గండి జ్యోతి ప్రసాద్ యాదవ్ (సన్నీ యాదవ్) మాట్లాడుతూ.. " ఈ రోజు నా పుట్టినరోజు సందర్భంగా మీరు చూపిస్తున్న ప్రేమ, నాపై కురిపించిన ఆశీస్సులు చూస్తుంటే నా జన్మ ధన్యమైందనిపిస్తోంది. ఈ రోజు నన్ను ఆశీర్వదించడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. మన చైతన్యపురి డివిజన్ అభివృద్ధి కోసం, పేద బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం మన పార్టీ (బీ.ఆర్.ఎస్) అడుగుజాడల్లో నిరంతరం శ్రమిస్తానని ఈ వేదిక సాక్షిగా మాట ఇస్తున్నాను. . నా తుది శ్వాస వరకు ప్రజా సేవలోనే ఉంటాను. మీ దీవెనలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇలాగే నాపై ఉండాలని, మనమంతా కలిసి మన డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామని కోరుకుంటున్నాను" అని తెలిపారు.రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, వేలాది మంది అభి మానులుకార్యకర్తలు హాజరై తోట మహేష్ యాదవ్ కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి, ప్రజా సేవలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు

# వానలు కురిపించు దేవుడా

## మహా వరుణ యాగం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

### - నాగార్జునసాగర్‌లో శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహణ- పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు



ఎక్కిరాల కొండల రావు, హైదరాబాద్ సచివాలయ ప్రతినిధి (డీకే చాటింపు): తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా వర్షాలను కురిపించాలని దేవీదేవతలను వేడుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మహా వరుణ యాగాన్ని ఘనంగా నిర్వహించింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో జరిపిన ఈ కార్యక్రమం సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయ్ విహారం వద్ద కృష్ణా నది ఒడ్డున ఏర్పాటుచేసిన ఈ పవిత్ర పూజలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. రుత్వికుల మార్గదర్శకత్వంలో యాగక్రతువులను పూర్తిచేసి పూర్ణాహుతి సమర్పించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమగుండాలతో వరుణదేవుడి అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తూ వైదిక విధానంలో హోమ క్రతువులు నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు హాజరయ్యారు. దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని సీఎం ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలన్న సంకల్పంతో ఈ యాగం నిర్వహించినట్లు చెప్పారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్‌నినో వల్ల రాష్ట్రంలో ఈసారి వర్షపాతం సాధారణం కన్నా తక్కువగా నమోదయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మహావరుణయాగానికి పూనుకుంది. నదులు నిండుగా ప్రవహించాలని, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లతో పాటు అన్ని ప్రాజెక్టులు నిండాలని కోరుకుంది. రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలంతో కళకళలాడాలని, తద్వారా భూగర్భ జలాలు పెరగాలని, పంటలు పుష్కలంగా పండి రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలని ఆకాంక్షించింది. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





## కేంద్ర ప్రభుత్వ కార్మిక,కర్షక

# ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ...

### జైల్ భరో సిద్ధమయ్యాం... సీపీఎం జిల్లా కార్యదర్శి జి. వెంకట్రామి రెడ్డి... - నారాయణపేటలో జైల్ భరో,రాస్తారోకో కార్యక్రమంలో పలువురి అరెస్టు...






నారాయణపేట,(డీకే చాటింపు): కేంద్ర ప్రభుత్వ కార్మిక,కర్షక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మిక, రైతు,కూలీల సంఘాల ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో మునిసిపల్ పార్క్ నుంచి పాత బస్టాండ్,కొత్త బస్టాండ్ మీదుగా ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది.అనంతరం అక్కడ రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాస్తారోకో చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కి తరలించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి. వెంకట్రామిరెడ్డి,సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం,ఎఐయూకేఎస్ జిల్లా కార్యదర్శి యాదగిరి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్,సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు కే.కాశీనాథ్, టియుసిఐ జిల్లా కార్యదర్శి రాము,ఎఐయు కెఎంఎస్ ప్రశాంత్ ప్రసంగిస్తూ.. కార్మికులను కట్టు  బానిసత్వానికి నెట్టే నాలుగు కార్మిక కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.నరేంద్ర మోడీ విధానాలతో సంపన్నుల ఆదాయాలు పెరుగుతున్నాయని, శ్రమజీవుల వేతనాలు రోజురోజుకు తరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యవసర ధరల పెరుగుదలతో కార్మిక వర్గం అతలాకుతలమవుతుందని అన్నారు.ఉపాధి కూలీల పొట్ట గొట్టే వి బిజి రాంజీ బిల్లును వెంటనే రద్దు చేయాలని,మాహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు  అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.పిఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రత కల్పించాలన్నారు. అమెరికా బ్రిటన్ ఆస్ట్రేలియా దేశాలతో స్వేచ్ఛ వాణిజ ఒప్పందాలను చేసుకొని 32 రకాల వ్యవసాయ ఉత్పత్తులను దేశంలోకి దిగుమతి చేసుకుంటున్నారని,దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడం ఆత్మహత్యలకు లోనవుతున్నారన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న కుదేలు అవుతున్నారన్నారు. కార్పొరేట్ అనుకూలమైన విధానాలు అమలు చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం తన విధానాలు మార్చుకోవాలని, ఈ దేశంలో అత్యధికంగా ఉన్న పేద మధ్యతరగతి కార్మిక వర్గపు అనుకూలమైన విధానాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షులు బాలమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, టియుసి జిల్లా నాయకులు నర్సింహ,ప్రసాద్,జిల్లా కోశాధికారి నరసింహ, సిఐటియు జిల్లా నాయకులు నరహరి,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నారాయణపేట పట్టణ నాయకులు కెంచి నారాయణ,చెన్నారెడ్డి,ఉపాధి క్షేత్ర సహాయకుల యూనియన్ అధ్యక్షులు డి. కృష్ణయ్య,హమాలి పట్టణ అధ్యక్షులు ఏసు రత్నం,రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దస్తప్ప,బొమ్మన్ పాడ్ బలరాం,అంగన్వాడి  నాయకులు,ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి అనురాధ,మున్సిపల్ యూనియన్ సాయిలు, సీపీఎం సోషల్ మీడియా కన్వీనర్ సోఫీ మజర్ ఉసేన్, గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దేశం సురక్షితంగా ఉండేందుకు

# జై జవాన్ జై కిసాన్ లను మరువొద్దు

### దయానంద్ గుప్తా ఎమ్మెల్సీ





ఎల్బీనగర్, ఆగస్టు10, డీకే చాటింపు:– సరిహద్దుల్లో జవాన్లు కాపలా కాస్తుంటే, మనం ఆహారం తీసుకోవడానికి రైతులు కష్టపడుతూ పంటలు పండిస్తున్నారు. అందుకే "జై జవాన్ –– జై కిసాన్" అనే నినాదం ఎప్పటికీ ప్రాసంగికమే. కొంపల్లి, దండమూడి ఎంక్లేవ్‌లోని తిరుమల రెసిడెన్సీ వద్ద వీర వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ఆర్మీ జవాన్లలో 15 మంది వీరులకు ఈ సందర్భంగా గౌరవ సన్మానం చేయబడింది. ఈ కార్యక్రమాన్ని లయన్ హేమలత రెడ్డి ( సువర్ణ వారధి ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్), లయన్ అర్చన అగర్వాల్ ( అవని వత్సల్య  ట్రస్ట్ )సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌరవ ఎమ్మెల్సీ బొగ్గారాపు దయానంద్ గుప్తా, లయన్ డా. ఎం. విజయలక్ష్మి గారు (జిల్లా గవర్నర్, డిస్ట్రిక్ట్ 320–ఐ), లయన్ డా. బి. విజయ్ రంగ (రీజియన్ ఛైర్మన్) తదితరులు హాజరై, వీర జవాన్లకు శాలువాలు మరియు మెమెంటోలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొగ్గారాపు దయానంద్ గుప్తా మాట్లాడుతూ, తాను 35 సంవత్సరాలుగా వాసవి, లయన్స్ క్లబ్, అదేవిధంగా ఇతర సంస్థల ద్వారా పేదలకు ఉచితంగా కుట్టు యంత్రాలు, గ్రైండర్లు అందించడం, వాసవి ట్రస్ట్ ద్వారా వైద్య సేవలు, విద్యా సహాయం అందించడం వంటి సేవలను కొనసాగిస్తున్నానని తెలిపారు. ప్రజల సేవలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తన ద్వారా అందరికీ చేరవేస్తున్నానని పేర్కొన్నారు. సైనికులను ముఖ్య అతిథిగా సన్మానించడం తనకు గర్వకారణమని తెలిపారు. లయన్ డా. ఎం. విజయలక్ష్మి (జిల్లా గవర్నర్), లయన్ డా. బి. విజయ్ రంగ (రీజియన్ ఛైర్మన్) మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఒక అంతర్జాతీయ సేవా సంస్థగా గత 108 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా అవసరమున్న చోట సేవలు అందిస్తూ వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన వారధి ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలియజేసి, భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా లయన్ ఇంటి లక్ష్మి దుర్గ, లయన్ పెరి, లయన్ శ్రీలత రాణి, లయన్ క్రాంతి కుమారి, లయన్ కృష్ణ కుమారి  పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లాలో భారీగా జన్ ధన్ యోజన ఖాతాలు



జనగామ/వరంగల్ ఆగస్టు 10 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి పసునూరి దేవేందర్‌వరంగల్ జిల్లాలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద ఆర్థిక సేవల పరిస్థితి,జనధన్ ఖాతాల సంఖ్య, రూపే కార్డుల జారీ,ఆధార్ అనుసంధానం,ఖాతాల నిర్వహణ, డీబీటీ ప్రయోజనాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.సోమవారం ఆమె మాట్లాడుతూ గత మూడేళ్లలో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం,ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ మౌలిక వసతుల విస్తరణపై కూడా వివరాలు కోరారు.ఎంపీ కావ్య అడిగిన  ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వరంగల్ జిల్లాలో పీఎంజేడీవై ఖాతాలు 2024 మార్చిలో 2,69,894 ఉండగా,2026 మార్చి నాటికి 3,02,317 కు పెరిగాయని,ఇదే సమయంలో ఆధార్‌తో అనుసంధానమైన ఖాతాలు 2,18,133 నుంచి 2,65,470 కు చేరాయన్నారు. రూపే కార్డులు 2,12,030 నుంచి 2,26,409కు పెరిగాయని వివరించారు.జన్‌ధన్ ఖాతాల సంఖ్య పెరిగినప్పటికీ ఆపరేటివ్ ఖాతాల సంఖ్యలో తగ్గుదల నమోదైందని, 2024 మార్చిలో 2,28,257 ఖాతాలు ఆపరేటివ్‌గా ఉండగా 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,20,607కు తగ్గిందని,పీఎంజేడీవై ఖాతాలకు అనుసంధానమైన డీబీటీ పథకాల వివరాలను కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ జిల్లాలో జనధన్ ఖాతాల సంఖ్య పెరగడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, ఖాతాలు తెరవడమే కాకుండా అవి నిరంతరం వినియోగంలో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా గ్రామీణ, పేద, అణగారిన వర్గాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేందుకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభతరం చేయాలన్నారు.

# ఒడిస్సా సీఎం రేసులో ధర్మేంద్ర




**భువనేశ్వర్, ఆగస్టు 5:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, దేశ విద్యావిధానంలో లోపాలపై ఇటీవల కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నెల రోజులు ఆందోళన చేసింది. మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేసింది. చివరకు మంత్రి ప్రధాని వారించినా వినకుండా పదవికి రాజీనామా చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో మంత్రి పదవికి రాజానీమా చేసిన ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పుడు ఏం చేయబోతున్నారు అన్న ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది. ఒడిశా నుంచి కొన్ని సంకేతాలు వస్తున్నాయి. రాజీనామా తర్వాత వచ్చిన ప్రతిస్పందనలు భిన్నంగా ఉన్నప్పటికీ, ఇటీవల భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులో కార్యకర్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన గ్రాండ్ వెల్కమ్ రాష్ట్ర రాజకీయాల్లో ఆయన పాత్రను గురించి కొత్త చర్చ మొదలైంది.నైతిక బాధ్యత తీసుకుని పదవి వదిలినట్లు చెప్పుకుంటున్నా, ఈ నిర్ణయం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని కొందరు భావించారు. కానీ ఒడిశాలో మాత్రం విషయం వేరేలా కనిపిస్తోంది. ఎయిర్‌పోర్టు వద్ద జరిగిన స్వాగతం కేవలం ఆచారం కాదు. అనేక మంది రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కావడం ఆయనకు పార్టీలో ఇంకా బలమైన ఆధారం ఉందని స్పష్టం చేస్తోంది. రాజకీయ వర్గాలు దీన్ని ఆయన రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశంగా చూస్తున్నాయి.ప్రధాన్‌కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని స్థానిక స్థాయిలో చర్చలు మొదలైంది. ఇది కొందరు స్థానిక నేతల్లో కలవరాన్ని కలిగిస్తోంది. 2024లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన సీఎం అభ్యర్థిగా బలంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం వేరే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ ఆ చర్చలు తలెత్తడం సహజం. అయితే వెంటనే మార్పు జరగడం సులభం కాదని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుత నాయకత్వం, సామాజిక సమీకరణలు, యువత అభిప్రాయం వంటి అంశాలు ఇందులో పాత్ర పోషిస్తాయి.ఇప్పటికీ అధికారికంగా ఏమీ స్పష్టం కాలేదు. ఆయనను కొంతకాలం విశ్రాంతి తీసుకునేలా చేయడం, పార్టీ సంస్థాగత పనుల్లో నియమించడం లేదా రాష్ట్ర రాజకీయాల్లో క్రమంగా పెద్ద పాత్ర ఇవ్వడం వంటి ఎంపికలు ముందున్నాయి. ఒడిశా బీజేపీలో ఆయనకు ఉన్న ప్రభావం, ఎమ్మెల్యేల మద్దతు బలంగా ఉన్నప్పటికీ, అంతిమ నిర్ణయం కేంద్ర అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. ఆ నిర్ణయం ఎలా ఉంటుందనేది రాష్ట్రంలో అధికార సమీకరణలను, అంతర్గత సమతుల్యతను ప్రభావితం చేస్తుంది.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఢిల్లీలో ఒక అధ్యాయం ముగిసినట్లు కనిపించినా, ఒడిశాలో మరో అధ్యాయం తెరవడానికి దారి తీస్తోంది. ఎయిర్‌పోర్టు స్వాగతం ఆ సంకేతాలను బలపరుస్తోంది. అయితే ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ఎంత వరకు కీలకమవుతారు, సీఎం పాత్ర వైపు అడుగులు పడతాయా అనేది కేవలం సమయం, అధిష్ఠానం నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది

# ఇన్సూరెన్స్ లేకపోతే.. పెట్రోల్, డీజిల్ బంద్.




**.భువనేశ్వర్, ఆగస్టు 5 :** బీమా లేని వాహనాలపై కఠిన చర్యలకు భారత అత్యున్నత న్యాయస్థానం సిద్ధమవుతోంది. మోటార్ థర్డ్–పార్టీ ఇన్సూరెన్స్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయించే లక్ష్యంతో సుప్రీంకోర్టు పలు కీలక ప్రతిపాదనలు చేసింది. ఇందులో భాగంగా, వాహనానికి చెల్లుబాటు అయ్యే బీమా ఉందో లేదో ధృవీకరించిన తర్వాతే పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే విధానంపై పైలట్ ప్రాజెక్టును రూపొందించాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ , కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ప్రతిపాదిత విధానం ప్రకారం, బీమా లేని వాహనాలకు అవసరమైన కవరేజీ పొందే వరకు ఇంధనం నిరాకరించే అవకాశాన్ని పరిశీలించనున్నారు. అయితే, ఇది ప్రస్తుతం కేవలం పైలట్ ప్రాజెక్టు మాత్రమేనని, దేశవ్యాప్తంగా వెంటనే అమల్లోకి రాదని స్పష్టం చేసింది.అంతే కాకుండా, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను వాహన్ డేటాబేస్, బీమా డేటాబేస్‌లతో అనుసంధానించాలని కూడా సుప్రీంకోర్టు ప్రతిపాదించింది. దీంతో బీమా లేని వాహనాలను ఆటోమెటిక్‌గా గుర్తించి, అవసరమైతే ఇ–చలాన్లు జారీ చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అతివేగం, రెడ్ సిగ్నల్ ఉల్లంఘన, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించేందుకు ఉపయోగిస్తున్న ంఔఖఖీ వ్యవస్థను బీమా ధృవీకరణకు కూడా వినియోగించాలని సూచించింది.రోడ్డు తనిఖీల సమయంలో ట్రాఫిక్ పోలీసులకు మొబైల్ యాప్‌లు లేదా హ్యాండ్‌హెల్డ్ పరికరాలను అందించి, వాహన బీమా వివరాలను తక్షణమే పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతో భౌతిక బీమా పత్రాలపై ఆధారపడకుండా అధికారులు ఆన్‌లైన్‌లోనే బీమా స్థితిని నిర్ధారించగలరు.కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు తప్పనిసరి థర్డ్–పార్టీ బీమా కాలపరిమితిని కూడా పెంచాలని సుప్రీంకోర్టు సూచించింది. కొత్త ప్రైవేట్ కార్లకు ప్రస్తుతం ఉన్న మూడు సంవత్సరాల బీమాను నాలుగు సంవత్సరాలకు, ద్విచక్ర వాహనాలకు ఐదు సంవత్సరాల బీమాను ఆరు సంవత్సరాలకు పొడిగించాలని ప్రతిపాదించింది. ప్రారంభ బీమా గడువు ముగిసిన తర్వాత బీమా పునరుద్ధరించకుండా రోడ్లపై తిరిగే వాహనాల సంఖ్యను తగ్గించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని కోర్టు పేర్కొంది. ఇప్పుడు ఈ ప్రతిపాదనలను ఎలా అమలు చేయాలనే అంశాన్ని సంబంధిత అధికారులు పరిశీలించనున్నారు.

# మళ్లీ తెరపైకి కావేరి అంశం



**బెంగళూరు, ఆగస్టు 5 :**ఈ సమస్య ఇప్పటిది కాదు. దశాబ్దాలు నాటిది. ఇంతవరకు పరిష్కార మార్గం దొరకలేదు. పరిష్కరించే బాధ్యత ఎవరూ తీసుకోలేదు.. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చేసుకున్నారు.అందువల్లే ఈ సమస్య మళ్లీ రిపీట్ అయింది. ఈసారి రాచ పుండు మాదిరిగా ఇబ్బంది పెడుతోంది. రెండు రాష్ట్రాల మధ్య ఇబ్బంది కరమైన వాతావరణానికి కారణమవుతోంది. దక్షిణాది రాష్ట్రాలలో ప్రముఖమైనవి తమిళనాడు, కర్ణాటక. ఈ రెండు రాష్ట్రాల మధ్య కావేరి నదీ జలాల వివాదం చాలా సంవత్సరాలుగా కొనసాగుతోంది.ప్రస్తుతం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. తమిళనాడులో కూడా కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ తో విజయ్ ప్రభుత్వానికి కొనసాగిస్తున్నారు. కావేరి జలాల వివాదం నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఈ వివాదం కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారిపోయింది. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. తమిళనాడులో అధికార పార్టీకి సపోర్ట్ చేస్తోంది. రెండు రాష్ట్రాలలో నాయకులకు బలమైన సెంటిమెంట్లను కాంగ్రెస్ పార్టీకి ఏం చేయాలో అర్థం కావడం లేదు . ఇందులో ఏమాత్రం పొరపాటు జరిగినా సరే కాంగ్రెస్ పార్టీ దుకాణం సర్దుకోవాల్సిందే .ఇటీవల రివర్ రెగ్యులేషన్ కమిటీ కీలక ఆదేశాలు జారీ చేసింది. దాని ప్రకారం తమిళనాడు రాష్ట్రానికి రోజు 3500 క్యూసెక్కుల కావేరి నది నీటిని విడుదల చేయాలి. ఈ ఆదేశాలు రావడమే ఆలస్యం కర్ణాటకలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. వర్షాలు లేకపోవడంతో సరిగ్గా నీటి నిల్వలేదని.. ఇలాంటి సమయంలో నీరు విడుదల చేయడం కష్టమని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే క్లారిటీ ఇచ్చారు. అయితే పరిస్థితి చేయి దాటిపోతున్న నేపథ్యంలో నేరుగా కర్ణాటక వచ్చి శివకుమార్ తో మాట్లాడాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నిర్ణయించారు. అయితే కర్ణాటక రాష్ట్రంలో అక్కడి ప్రజలు.. ఇతర సంఘాల నుంచి తిరుగుబాటు విపరీతంగా ఉండడంతో విజయ్ పర్యటనను రద్దు చేసుకోవాలని శివకుమార్ సూచించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కర్ణాటక రాష్ట్రానికి అసలు రావద్దని శివకుమార్ విజయ్ కి సూచించారు.తమిళనాడు రాజకీయాలను కావేరి నది నీటిని వేరుగా చూడడం సాధ్యం కాదు . కావేరి నది నీటి ఆధారంగానే తమిళనాడు రైతులు పంటలు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కర్ణాటక ఒత్తిడికి తలవంచితే విజయ్ కి తమిళనాడు రాష్ట్రంలో ఇబ్బందికరమైన పరిణామం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలోనే విజయ్ ప్రభుత్వం కావేరి నది జలాల వ్యవహారాన్ని సుప్రీంకోర్టులో తేల్చుకోవాలని భావించింది. మరోవైపు విజయ్ క్యాబినెట్ లో ఉన్న చాలామంది మంత్రులు కర్ణాటక ముఖ్యమంత్రి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. కావేరి నది నీళ్లు విడుదల చేయకపోతే.. విజయ్ తన ప్రభుత్వానికి సంబంధించి కాంగ్రెస్ ఇచ్చిన సపోర్ట్ పై ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అక్కడ మీడియాలో వార్తలు వస్తున్నాయి.తమిళనాడు మంకుపట్టు వీడకపోవడం.. కర్ణాటక ప్రభుత్వం పట్టుదలతో ఉండడంతో కావేరి వివాదం కాంగ్రెస్ పార్టీకి చాలా ఇబ్బందికరంగా మారింది. కర్ణాటక ముఖ్యమంత్రి పై స్థానిక రైతులు.. బిజెపి.. జెడిఎస్ పార్టీల నుంచి ఒత్తిడి వస్తోంది. ఒకవేళ కర్ణాటక రాష్ట్రం నుంచి తమిళనాడుకు కావేరి నది జలాలు విడుదల చేస్తే మాత్రం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకుపోయే ప్రమాదం ఉంది. అందువల్లే ఓటు బ్యాంకు ను కాపాడుకోవడానికి.. బిజెపి వేసిన ఉచ్చు నుంచి రక్షించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అనేక రకాల ప్రయత్నాలు చేస్తుంది. దీనికి తోడు ఇటీవల శివకుమార్ ఆధ్వర్యంలో తమిళనాడు ప్రభుత్వం ప్రతిపాదించిన మేకదాటు ప్రాజెక్టును ఏకపక్షంగా వ్యతిరేకించారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య వివాదం మరింత పెరిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రాంతీయ సెంటిమెంట్లు అధికంగా ఉంటాయి.. ఈ సెంటిమెంట్లకు రెస్పెక్ట్ ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీ పుట్టి కావేరిలో మునగడం ఖాయం

# యాక్టివ్ పాలిటిక్స్ లోకి నల్లారి




**హైదరాబాద్, ఆగస్టు 5 :** ఏపీ బీజేపీలో చాలామంది నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు బాగానే గెలిచారు. 8 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీ నుంచి విజయం సాధించారు. మరో ముగ్గురు ఎంపీలు సైతం ఉన్నారు. ఒక రాష్ట్ర మంత్రి తో పాటు కేంద్ర మంత్రి కూడా ఉన్నారు.. ఎందరు ఉన్న బిజెపి పెద్దగా సౌండ్ చేయడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి లైన్ లోకి వచ్చారు. ప్రెస్ మీట్ పెట్టి రాష్ట్రాల మధ్య జలవివాదం గురించి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. జలవివాదాలు విషయంలో ఎటువంటి మొహమాటలకు పోవద్దని.. పక్క రాష్ట్రాలతో చర్చలు జరిపి పరిష్కరించుకోవాలని సూచించారు. అవసరం అనుకుంటే పోరాటం చేయాలని కూడా పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన సాహేతుకంగా జరగలేదని.. అప్పట్లోనే జల పంపకాలు చేపడుతూనే వివాదాలు పరిష్కరించుంటే ఇంతవరకు పరిస్థితి వచ్చి ఉండేది కాదు అని అభిప్రాయపడ్డారు కిరణ్ కుమార్ రెడ్డి.ఉమ్మడి రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో రోశయ్య ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన స్వచ్ఛందంగా తప్పుకోవడంతో.. స్పీకర్ గా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఆయన హయాంలోనే రాష్ట్ర విభజన జరిగింది. దానిని తీవ్రంగా వ్యతిరేకించారు కిరణ్ కుమార్ రెడ్డి. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేసారు. సొంతంగా సమైక్యాంధ్ర పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అది అంతగా వర్కౌట్ కాలేదు. చివరకు బిజెపిలోకి వచ్చి ఆ పార్టీ తరఫున మొన్నటి ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఉన్నట్టుండి మీడియా ముందుకు వచ్చి రాష్ట్ర విభజన సమస్యలు, జలవివాదాలు గురించి ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రస్తుతం గోదావరి తో పాటు కృష్ణా జలాలకు సంబంధించి వివాదాలు నడుస్తున్నాయి. ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదం ఉంది. ఆపై పోలవరం ప్రాజెక్టు విషయంలో ఒడిస్సా తో పాటు చత్తీస్గడ్ తో కూడా వివాదం నడుస్తోంది. వాటన్నింటినీ పరిష్కరించుకోవాలని ఏపీ ప్రభుత్వానికి కిరణ్ కుమార్ రెడ్డి సూచించడం గమనార్హం. అవసరం అనుకుంటే కేంద్ర ప్రభుత్వంతో గట్టిగా మాట్లాడాలని సూచిస్తున్నారు కిరణ్. ఎన్నికల వరకు మాత్రమే పొత్తు కానీ.. పార్టీలు, ప్రభుత్వం వేరు అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. అయితే చాలా రోజులకు కిరణ్ కుమార్ రెడ్డి ముందుకు రావడం గమనార్హం. రాష్ట్రం కోసం కీలక సూచనలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే రాజ్యసభ ఎన్నికల సమయంలో కిరణ్ కుమార్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. కానీ వివిధ సమీకరణల్లో ఆయనకు పదవి దక్కలేదు. ఇప్పుడు ఆయన పొలిటికల్ గా యాక్టివ్ అవుతారన్న టాక్ వినిపిస్తోంది. అందులో భాగంగానే సరిహద్దు జలాల వివాదంపై మాట్లాడుతున్నారని ప్రచారం సాగుతోంది. మరి చూడాలి ఆయన పాత్ర ఎలా ఉండబోతుందో..

# 12 ఆగస్టు 11న 'రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ కొత్త దేశం




**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** బలూచిస్తాన్.. పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం. 45 శాతం భూభాగం కలిగి ఉంటుంది. 1948లో బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ బలవంతంగా కలుపుకుంది. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. వివక్షతో బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటోంది. ఈ క్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇటీవల స్వయంప్రకటిత "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. ఆగస్టు 11న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చింది. బలూచిస్తాన్.. పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం. 45 శాతం భూభాగం కలిగి ఉంటుంది. 1948లో బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ బలవంతంగా కలుపుకుంది. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. వివక్షతో బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటోంది. ఈ క్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇటీవల స్వయంప్రకటిత "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. ఆగస్టు 11న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చింది.బలూచ్ జాతీయవాదులు 1947 ఆగస్టు 11న కలాత్ రాజ్యం (ఆధునిక బలూచిస్తాన్‌లోని ముఖ్య భాగం) స్వతంత్రంగా ప్రకటించబడిందని చెబుతారు. బ్రిటిష్ వైదొలగడం సమయంలో కలాత్ ఖాన్‌తో స్టాండ్‌స్టిల్ ఒప్పందం కుదిరి, దానిని స్వతంత్ర సార్వభౌమ రాజ్యంగా గుర్తించినట్లు కొన్ని నివేదికలు ఉన్నాయి. అయితే 1948 మార్చిలో పాకిస్తాన్ సైన్యం జోక్యం చేసుకుని కలాత్‌ను విలీనం చేసింది. బలూచ్ వైపు ఇది బలవంతపు విలీనం అని, పాకిస్తాన్ వైపు ఇది చట్టబద్ధమైన అనుసంధానం అని వాదనలు ఉన్నాయి. అయితే ఈ చారిత్రక అసంతృప్తి ఆధారంగా 1948 నుంచి అనేక తిరుగుబాటు దశలు జరిగాయి. ప్రస్తుత ఉద్యమం దాని కొనసాగింపుగా కనిపిస్తుంది.2026 జూలైలో మిర్ యార్ బలోచ్ వంటి నాయకులు "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించారు. వారు జాతీయ జెండా, గీతం, కరెన్సీ (బలోచి ఫాలస్) ప్రవేశపెట్టినట్లు, 85 శాతం భూభాగంపై నియంత్రణ ఉన్నట్లు, స్వంత పరిపాలనా వ్యవస్థ ఉన్నట్లు దావా చేశారు. ఆగస్టు 3, 2026న ఆగస్టు 11ను స్వాతంత్ర్య దినోత్సవంగా ప్రకటించి, ప్రపంచవ్యాప్తంగా జెండా ఎగురవేసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఇది 1947 చారిత్రక తేదీపై ఆధారపడి ఉంది. అయితే ఈ దావాలు స్వతంత్రంగా ధ్రువీకరించబడలేదు. ఏ దేశం లేదా అంతర్జాతీయ సంస్థ ఈ "రిపబ్లిక్"ను గుర్తించలేదు. బలూచిస్తాన్ అంతర్జాతీయంగా పాకిస్తాన్ ప్రావిన్స్‌గానే కొనసాగుతోంది.బలూచ్ వైపు ప్రధాన ఆరోపణ సహజ వనరులు (గ్యాస్, ఖనిజాలు, గ్వాదర్ పోర్ట్) స్థానికులకు ప్రయోజనం లేకుండా చైనా?పాక్ ఎకనామిక్ కారిడార్ ద్వారా బయటకు వెళుతున్నాయని, యువతపై అణచివేత, మహిళలు మాయం కావడం వంటి మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని పేర్కొంటోంది. బీఎల్‌ఏ వంటి సమూహాలు ఈ కారణాలతో పోరాటం చేస్తున్నాయని చెబుతాయి. ఈ ఆరోపణలు హ్యూమన్ రైట్స్ సంస్థలు, కొన్ని అంతర్జాతీయ నివేదికలలో కూడా ప్రస్తావించబడ్డాయి. అదే సమయంలో పాకిస్తాన్ ఈ సమూహాలను ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తుంది. బీఎల్‌ఏను కొన్ని దేశాలు విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించాయి.బీఎల్‌ఏ, ఇతర సమూహాలు సైనిక స్థావరాలు, మౌలిక వసతులపై దాడులు చేస్తూ ఉన్నాయి. 2026లో కోఆర్డినేటెడ్ దాడులు జరిగాయి, కానీ పాకిస్తాన్ సైన్యం కౌంటర్?ఆపరేషన్లు కొనసాగిస్తోంది. ప్రావిన్స్‌పై పూర్తి నియంత్రణ బలూచ్ సమూహాల చేతుల్లో ఉందన్న దావా స్వతంత్ర మూలాల ద్వారా నిర్ధారించబడలేదు. పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం ఇప్పటికీ అధికారిక నిర్వహణలో ఉన్నాయి. స్వాతంత్ర్య ప్రకటన చట్టపరంగా రాజకీయ వ్యక్తీకరణగా ఉండవచ్చు, కానీ ప్రభావవంతమైన ప్రభుత్వం, విదేశీ సంబంధాల సామర్థ్యం రాష్ట్రంగా నిలబడటానికి అవసరమైన అంశాలు లేవు.బలూచిస్తాన్ సమస్య చారిత్రక అసంతృప్తి, వనరుల పంపిణీ అసమానత, మానవ హక్కుల ఆరోపణలు, సాయుధ పోరాటాల మిశ్రమం. స్వయంప్రకటిత స్వాతంత్ర్యం గుర్తింపు పొందకపోయినా, ఉద్యమం కొనసాగుతోంది. శాంతియుత రాజకీయ పరిష్కారం, స్థానిక అభివృద్ధి, మానవ హక్కుల రక్షణ లేకుండా ఈ సంఘర్షణ మరింత సంక్లిష్టం కావచ్చు. పాకిస్తాన్ ఎలా స్పందిస్తుందో, అంతర్జాతీయ సమాజం ఎలా చూస్తుందో ఆగస్టు 11 తర్వాత స్పష్టం అవుతుంది.

# ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోలు



**హైదరాబాద్, ఆగస్టు 5 :** గ్రేటర్ హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతుండటంతో ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు నాటికి ప్రస్తుతమున్న 26 డిపోల సంఖ్యను 31కి పెంచేందుకు ముషీరాబాద్‌లో హైదరాబాద్–3, నాగారం రోడ్డులో జవహర్‌నగర్ డిపోలతో పాటు మూతబడిన రాణిగంజ్–2 డిపోను పునఃప్రారంభించనున్నారు. స్థల కేటాయింపుపై రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను కోరారు. నగరంలో ప్రస్తుతం 493 ఈవీ బస్సులు నడుస్తుండగా.. అన్ని డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం, మరోవైపు నగర శివారు ప్రాంతాలు వేగంగా విస్తరిస్తుండటంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్ డిపోలను అందుబాటులోకి తేనుంది. సంస్థ అవసరాలు, భవిష్యత్తు రవాణా ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని నగరంలో కొత్తగా 3 నుంచి 5 వరకు బస్ డిపోలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ముందస్తుగా ముషీరాబాద్‌లోని 5 ఎకరాల స్థలంలో హైదరాబాద్–3 డిపోను, నాగారం రోడ్డులోని 5 ఎకరాల విస్తీర్ణంలో జవహర్‌నగర్ డిపోను ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం వేగంగా చర్యలు తీసుకుంటోంది. వీటితో పాటు గతంలో రకరకాల కారణాలతో మూతబడిన రాణిగంజ్–2 డిపోను పునరుద్ధరించి, ఆధునిక వసతులతో రీ–మోడిఫికేషన్ చేసి త్వరలోనే పునఃప్రారంభించాలని నిర్ణయించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 26 బస్ డిపోలు కొనసాగుతుండగా.. ఈ ఏడాది డిసెంబరు నాటికి వీటి సంఖ్యను 31కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో కొత్త డిపోల ఏర్పాటుకు తగిన స్థలాలు కేటాయించాలని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను ఆర్టీసీ అధికారులు కోరారు. శివారు ప్రాంతాల్లో డిపోలు అందుబాటులోకి వస్తే నగర శివార్ల ప్రజలకు ప్రజారవాణా మరింత సులభతరం కానుంది.ప్రస్తుతం గ్రేటర్ ఆర్టీసీ ప్రతినిత్యం సుమారు 2800 బస్సులను నడుపుతుండగా.. వాటిలో 493 ఎలక్ట్రిక్ బస్సులు సేవలు అందిస్తున్నాయి. ప్రస్తుతం హయత్ నగర్–2 డిపో నుంచి 98, హెచ్‌సీయూ డిపో నుంచి 101, కూకట్‌పల్లి డిపో నుంచి 20, మియాపూర్–2 డిపో నుంచి 100, కంటోన్మెంట్ డిపో నుంచి 80, రాణిగంజ్ డిపో నుంచి 75 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌ను పూర్తిస్థాయి ఈవీ జోన్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న 26 డిపోలలోనూ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉండేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.నగర శివారు ప్రాంతాల్లోని ప్రతి డిపోలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాల నుంచి హైదరాబాద్ నగరానికి వచ్చే ఎలక్ట్రిక్ బస్సులు కూడా రాత్రి వేళల్లో సమీపంలోని ఈ డిపోలలో సులువుగా ఛార్జింగ్ చేసుకొని తెల్లవారుజామున మళ్లీ జిల్లాలకు తిరుగు ప్రయాణమయ్యే వెసులుబాటు కలుగుతుంది. ఈ చర్యల ద్వారా పర్యావరణహిత రవాణాతో పాటు నగరంలో బస్సు సర్వీసుల సమర్థత మరింత పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రేవంత్ ధీమా వెనుక...



**మహబూబ్ నగర్, ఆగస్టు 5 :** తెలంగాణ రాజకీయ చరిత్రలో 2023 అసెంబ్లీ ఎన్నికలు ఒక మలుపు. అప్పటి వరకు పలువురు విశ్లేషకులు, రాజకీయ వర్గాలు కాంగ్రెస్ పార్టీని పూర్తిగా పక్కన పెట్టేసినట్లు చూశారు. అయితే ఆ అంచనాలన్నీ తలకిందులైపోయాయి. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరో మూడు పర్యాయాలు అధికారం కొనసాగుతుందనే ధీమాతో ముందుకు సాగుతోంది. 2018 నుంచి 2023 మధ్య కాలంలో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ పెరుగుతున్న బలం స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ అక్కడక్కడా కనిపించకపోవడంతో, అసలు పోటీ బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే జరుగుతుందని చాలామంది భావించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా బీజేపీని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని రాజకీయ వ్యూహాలు రచించారు. ఓట్లు చీలిపోతే మూడోసారి అధికారం సాధ్యమవుతుందని గులాబీ పార్టీ నాయకులు అంచనా వేశారు. అయితే జరిగింది వేరే. బీఆర్ఎస్‌పై ఉన్న అసంతృప్తి ఓట్లు అన్నీ ఒకే చోటకు కేంద్రీకృతమయ్యాయి. ఆ ఫలితం కాంగ్రెస్‌కు దక్కింది. ఇక్కడ రేవంత్‌రెడ్డి పాత్ర కీలకమైంది. కేసీఆర్‌కు నిజమైన ప్రత్యామ్నాయం తానేనని స్పష్టంగా చాటుకున్నారు. పార్టీలోని అనేక అగ్ర నేతలను సమన్వయం చేసుకుని, ఏకగ్రీవ నాయకత్వం ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు. ఫలితంగా ప్రజల్లో విశ్వాసం పెరిగి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గడచిన 30 నెలలుగా ఆయన తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారు.రేవంత్ రెడ్డి ప్రతి సభలోనూ, పార్టీ సమావేశాల్లోనూ కాంగ్రెస్ మరో మూడు పర్యాయాలు గెలుస్తుందని స్పష్టంగా చెబుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో కూడా 2034 వరకు తానే ఉంటానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇది కేవలం కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే ప్రయత్నం మాత్రమే కాదు. దీని వెనుక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో సాధారణంగా వర్గపోరులు పార్టీని బలహీనపరుస్తాయి. అయితే ఏక నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ అద్భుతాలు సృష్టించగలదని గత చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఆ లోటును తీరుస్తున్నారని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీనివల్ల తెలంగాణలో కాంగ్రెస్ బలం మరింతగా పెరుగుతోంది.దేశవ్యాప్తంగా బీజేపీపై అసంతృప్తి మెల్లగా పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇది కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితిని సృష్టిస్తోంది. ఇండియా కూటమిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్, 2029లో కేంద్రంలో అధికారం సాధించగలమని నమ్మకంతో ఉంది. దక్షిణ భారతదేశంలోనే కాంగ్రెస్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ, కర్ణాటక, కేరళల్లో అధికారంలో ఉండటం, తమిళనాడులో భాగస్వామ్యం ఇలాంటి అంశాలు ఆ పార్టీకి బలం చేకూరుస్తున్నాయి. యువతలో కూడా కేంద్ర ప్రభుత్వంపై అసంతృప్తి ఉందని, వారు జాతీయ స్థాయిలో బలమైన ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఎంచుకోవచ్చని రేవంత్ అంచనా వేస్తున్నారు. ఈ జాతీయ పరిణామాలు తెలంగాణలోని స్థానిక రాజకీయాలపై కూడా ప్రభావం చూపుతాయి. 2028 ఎన్నికల నాటికి ఈ పరిస్థితులు మరింత బలపడితే, కాంగ్రెస్‌కు మరోసారి విజయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం.కాంగ్రెస్ బలం పెరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. గతంలో బలమైన ప్రాంతీయ పార్టీగా నిలిచిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి తన స్థానాన్ని కాపాడుకోవాల్సిన సవాలు ఎదుర్కొంటోంది. కాంగ్రెస్‌లో ఏక నాయకత్వం కొనసాగితే, ప్రాంతీయ పార్టీలకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ పునరాగమనం కేవలం ఒక ఎన్నికల ఫలితం మాత్రమే కాదు. బలమైన నాయకత్వం, జాతీయ పరిస్థితులు, యువత ఆకాంక్షలు కలిసి ఒక కొత్త రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. రేవంత్ రెడ్డి చెబుతున్న మూడు టర్ముల లక్ష్యం నిజమవుతుందా లేదా అనేది కాలం నిర్ణయిస్తుంది. అయితే ప్రస్తుత పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగానే కనిపిస్తున్నాయి.

# కాళేశ్వరమే అజెండా

హైదరాబాద్, ఆగస్టు 5 : తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తతలకు వేదికగా మారింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మొదటి నుంచి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్ రావు నేరుగా అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని విసురుతున్న సవాళ్లు.. ఈసారి సభలో తీవ్ర దుమారం రేపేలా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రూ. లక్ష కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం , మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, నిధుల వినియోగంపై జరగనున్న చర్చే ఈ సమావేశాల్లో ప్రధానాంశంగా మారనుంది.కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయంగా, పరిపాలనాపరంగా తమకు ప్రధాన ఆయుధంగా మార్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుండగా, రైతుల నీటి అవసరాలను చూపుతూ ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో మేడిగడ్డ నుంచి నీళ్లను ఎత్తిపోయాలి అని చేపట్టిన నిరసనలు, క్షేత్రస్థాయి ఉద్యమాలు రాజకీయాన్ని వేడెక్కించాయి. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి నుంచి వరద నీరు సహజంగానే తిరిగి మేడిగడ్డ వైపు ప్రవహించడం, బ్యారేజీ సాంకేతిక పరిమితులు బయటపడటంతో బీఆర్ఎస్ ఒక్కసారిగా తీవ్ర ఆత్మరక్షణలో పడింది.ఇరిగేషన్ నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలను ముందుపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పడం బీఆర్ఎస్‌కు సవాలుగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన పరిస్థితుల్లో నీటిని నిల్వ చేయడం లేదా పంపింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ప్రభుత్వం వాదిస్తుంటే.. బీఆర్ఎస్ మాత్రం కేవలం పొలాలకు నీళ్లు ఇవ్వకుండా నాటకాలు ఆడుతోందని ఆరోపించింది. అయితే, వరద నీటి సహజ ప్రవాహం , ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ పరిణామాలు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వాదనకే బలాన్ని చేకూర్చడంతో, సోషల్ మీడియాలో సైతం బీఆర్ఎస్ రక్షణ ధోరణిలో పడాల్సి వచ్చింది.ఈ వర్షాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం అత్యంత స్పష్టంగా ఉంది. కేసీఆర్‌ను నేరుగా అసెంబ్లీకి రప్పించడం ద్వారా, ఆయన సమక్షంలోనే కాళేశ్వరం డిజైన్ లోపాలు, పీసీ ఘోష్ కమిషన్ విచారణ పురోగతి, మరియు రాష్ట్రంపై



పడిన ఆర్థిక భారాన్ని ఎండగట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. గత సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉండటాన్ని రేవంత్ రెడ్డి రాజకీయంగా వాడుకుంటూ.. ప్రతిపక్ష నేతగా సభకు వచ్చి తమ హయాంలో జరిగిన నిర్మాణాలను సమర్థించుకోవాలని సవాల్ విసురుతున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్గాలు కూడా ఈ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. కాళేశ్వరం అంశంలో సాంకేతిక లోపాలను సరిదిద్దకుండా ప్రభుత్వం రాజకీయం చేస్తోందని, ఆరుగాలం కష్టపడే రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని సభలో తిప్పికొట్టేందుకు కేటీఆర్, హరీష్ రావులు వ్యూహాలు రచిస్తున్నారు. అయితే, కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వస్తారా లేదా అనేది ఇంకా ఉత్కంఠగానే మారింది. ఒకవేళ కేసీఆర్ సభకు హాజరైతే రేవంత్–కేసీఆర్ మధ్య జరిగే ప్రత్యక్ష సభ సమరం తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అత్యంత కీలకమైన ఘట్టంగా మారనుంది.ఈ వర్షాకాల సమావేశాల్లో కాళేశ్వరంపై జరిగే చర్చ ప్రజాభిప్రాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ రీ–డిజైన్ వైఫల్యం గా ప్రజల్లో శాశ్వతంగా ముద్ర వేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు ఎండిపోతోంది అని నిరూపించేందుకు బీఆర్ఎస్ పోరాడుతోంది. అదే సమయంలో నిరుద్యోగ సమస్యలు సహా రాష్ట్రంలో ఉన్న అన్ని అంశాలను హైలెట్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ అసెంబ్లీ సమావేశాలు కేవలం చట్టసభల చర్చలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ గమనాన్ని నిర్దేశించే అత్యంత కీలక పోరాట వేదికగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

# మొక్కజొన్న ఆల్ టైమ్ రికార్డ్



అదిలాబాద్, ఆగస్టు 5 : తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్న విక్రయాల్లో మార్క్‌ఫెడ్ ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఈ–వేలం విధానం ద్వారా నిర్వహించిన టెండర్లలో చరిత్రలోనే తొలిసారిగా మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వ్యాపారుల సిండికేట్‌ను అడ్డుకుంటూ ఈ–వేలం నిర్వహించగా.. టన్నుకు గరిష్ఠంగా రూ.26,500 ధర లభించింది. కొనుగోలు ధర కంటే టన్నుకు సగటున రూ.1,370 లాభం రావడంపై మంత్రి తుమ్మల తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్నల విక్రయంలో మార్క్‌ఫెడ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. సంస్థ చరిత్రలోనే మొదటిసారిగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే అత్యధిక ధర లభించి రికార్డు స్థాయి లాభాలు నమోదయ్యాయి. ఈ–వేలం విధానం ద్వారా నిర్వహించిన పారదర్శక టెండర్ల వల్ల వ్యాపారుల సిండికేట్‌కు చెక్ పడటమే కాకుండా.. మార్క్‌ఫెడ్‌కు భారీగా ఆదాయం సమకూరింది.గతంలో ప్రతి ఏటా టెండర్ల సమయంలోవ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు కొటేషన్లు వేసేవారు. అధికారుల సహకారంతో తక్కువ ధరలకే విక్రయాలు జరగడం వల్ల మార్క్‌ఫెడ్ తీవ్ర నష్టాలను చవిచూసింది. ఇప్పటికే ఈ సంస్థ రూ. 1000 కోట్ల నష్టాల్లో ఉండటంతో పాటు, మరో రూ. 2 వేల కోట్ల అప్పుల భారంతో కూరుకుపోయింది. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి టెండర్ల ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు.మంత్రి ఆదేశాల మేరకు సిండికేట్లకు ఎలాంటి అవకాశం లేకుండా కేవలం ఈ–వేలం ద్వారానే టెండర్లు నిర్వహించాలని నిర్ణయించారు. క్వింటాలుకు మద్దతు ధర రూ.2,400 చొప్పున, టన్నుకు కనీసం రూ.24 వేల కంటే తక్కువ ధర వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదని కఠిన నిబంధన పెట్టారు. దీనికి అనుగుణంగా మార్క్‌ఫెడ్ యాసంగి సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన 14.60 లక్షల టన్నుల మొక్కజొన్నలో 10.98 లక్షల టన్నులకు గాను జులై 31, ఆగస్టు 1, ఆగస్టు 3 తేదీల్లో మూడు విడతలుగా విజయవంతంగా ఈ–వేలం నిర్వహించింది. అనంతరం సోమవారం అధికారులు ఆ టెండర్లను సమగ్రంగా పరిశీలించి ఖరారు చేశారు.ఈ మూడు విడతల వేలంలో మొక్కజొన్నకు ఊహించని విధంగా విశేష స్పందన లభించింది. టన్నుకు గరిష్ఠ ధర రూ. 26,500 పలకగా, ఇది వేలం కనీస ధర కంటే రూ. 2,500 ఎక్కువ కావడం విశేషం. కనిష్ఠ ధర కూడా మద్దతు ధర కంటే ఎక్కువగా రూ.24,100 గా నమోదైంది. మొత్తంగా ఈ విక్రయాల్లో సగటున టన్నుకు రూ. 25,370 ధర లభించింది. దీంతో మార్క్‌ఫెడ్‌కు కొనుగోలు వెచ్చించిన సొమ్ముతో పోలిస్తే టన్నుకు సుమారు రూ. 1,370 లాభం సమకూరింది. సరైన నిర్ణయాలు, పారదర్శక విధానాల వల్ల సంస్థకు ఈ స్థాయిలో లాభాలు రావడం పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతోషం వ్యక్తం చేశారు.

# టీ కాంగ్రెస్ లో పట్టభద్రుల ఎన్నికల వేడి



హైదరాబాద్, ఆగస్టు 5 : తెలంగాణ రాజకీయం ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న కీలకమైన ఎన్నికలు కావడం, విద్యావంతులు, ఉద్యోగుల నాడిని ప్రతిబింబించే పోరు కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇటీవల జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశంలోనూ ఎమ్మెల్సీ ఎన్నికల సమరసన్నాహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏదేమైనా రెండు స్థానాల్లోనూ గెలిచి తీరాల్సిందేనని, విజయం సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పార్టీ అధిష్టానం ముఖ్యనేతలకు స్పష్టమైన టార్గెట్ నిర్దేశించింది.అధికార పార్టీ తరఫున రేసులో నిలిచి ఎమ్మెల్సీగా సభలో అడుగుపెట్టేందుకు సీనియర్లు, యువ నేతలు తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. పోటీకి దిగేందుకు ఆశావహుల సంఖ్య భారీగా ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానానికి అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది. మహబూబ్‌నగర్ ? హైదరాబాద్ ? రంగారెడ్డి పట్టభద్రుల స్థానానికి ఆశావహులు భారీగా ఉన్నారు. ఇక రాజధాని నగరం పరిధిలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ ? హైదరాబాద్ ? రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్‌లో గట్టి పోటీ నెలకొంది. ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల్లో పట్టున్న పలువురు ముఖ్య నేతలు తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధిగా గుర్తింపు ఉన్న హర్ష వర్ధన్ రెడ్డి విద్యావంతుల మద్దతు తనకే ఉందనే ధీమాతో ఉన్నారు. సామ రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ గా పార్టీ వాణిని బలంగా వినిపిస్తున్నారు. ఆయన టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. టీ శాట్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న శివసేనా రెడ్డి యువత, విద్యావంతులలో మంచి గుర్తింపు పొందారు. ఇక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ రెడ్డి యువజన విభాగానికి ప్రాతినిధ్యం కల్పిస్తూ రేసులో ముందంజలో ఉన్నారు. వీళ్లతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు గౌరీ సతీష్ తో పాటు మన్నే జీవన్ రెడ్డి కూడా టికెట్ రేసులో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.కాంగ్రెస్‌కు పట్టున్న ప్రాంతంగా భావించే నల్గొండ ? ఖమ్మం ? వరంగల్ పట్టభద్రుల స్థానానికి డిమాండ్ ఊహించని స్థాయిలో ఉంది. పార్టీలోని కీలక సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు ఎక్కువమంది ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఇక్కడ టికెట్ దక్కించుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి పేరు ఈ స్థానం నుంచి ప్రముఖంగా వినిపిస్తోంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యమ నేతగా పేరుపొందిన చనగాని దయాకర్ సైతం విద్యార్థి, నిరుద్యోగ వర్గాల మద్దతు తనకే ఉందంటూ పోటీలో నిలిచారు. స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్చార్జ్ ఇందిర కూడా ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు.కోర్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించిన అనంతరం, విజయావకాశాలు ఉన్న నేతలనే బరిలోకి దించాలని హైకమాండ్ సూచించింది. సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయి సమీకరణాలు, ఉద్యమ నేపథ్యం, అలాగే పట్టభద్రులలో ఉన్న ప్రజాదరణ ఆధారంగా మాత్రమే అభ్యర్థులను ఖరారు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుల నిర్ణయంపైనే ప్రస్తుతం ఈ ఆశావహుల జాతకాలు ఆధారపడి ఉన్నాయి. ఎవరికి ఎమ్మెల్సీ టికెట్ వరిస్తుంది? అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుంది అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తున్న ప్రధాన అంశం!

# స్టేడియం నుంచి 2 నుంచి 3 కోట్ల లీటర్లు

**హైదరాబాద్, ఆగస్టు 5 :** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేడియంలో వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)కి తెలిపింది. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రతి ఏడాది 2 నుంచి 3 కోట్ల లీటర్ల వరకు వర్షపు నీటిని సేకరించి వినియోగించే అవకాశం ఉందని వెల్లడించింది.పిచ్ నిర్వహణ కోసం భూగర్భ జలాలను అధికంగా వినియోగిస్తున్నారంటూ దాఖలైన కేసులో భాగంగా హెచ్‌సీఏ జూలై 2న ఎన్‌జీటీకి స్టేటస్ రిపోర్ట్ సమర్పించింది. కొత్త రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఫిల్ట్రేషన్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేసేందుకు కొంత గడువు ఇవ్వాలని, అప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ట్రైబ్యునల్‌ను కోరింది.హెచ్‌సీఏ పరిశీలిస్తున్న ప్రతిపాదన ప్రకారం.. స్టేడియంలో పడే వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసి మైదానం నిర్వహణ, తోటల సాగు, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. అదనంగా భూగర్భ జలాలను రీచార్జ్ చేసే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్టేడియాన్ని వాటర్ పాజిటివ్‌గా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు హెచ్‌సీఏ తెలిపింది. వర్షపు నీటితో పాటు మురుగునీటిని శుద్ధి చేసి మైదానం, పచ్చదనం నిర్వహణ కోసం వినియోగించే అవకాశాలను కూడా హెచ్‌సీఏ పరిశీలిస్తోంది. దీంతో భూగర్భ జలాల వినియోగం మరింత తగ్గుతుందని పేర్కొంది.ప్రస్తుతం ఉప్పల్ స్టేడియంలో మొత్తం 8.2 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే మూడు ట్యాంకులు ఉన్నాయి. గేట్ నంబర్–5 సమీపంలో 3.5



లక్షల లీటర్ల సామర్థ్యంతో ఒక ట్యాంకు ప్రజా అవసరాల కోసం వినియోగిస్తుండగా, 2.2 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకును అగ్నిమాపక అత్యవసర అవసరాల కోసం కేటాయించారు. గేట్ నంబర్–3 వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకు సాధారణ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్నారు.హైదర్ అలీ అనే వ్యక్తి ఎన్‌జీటీలో దాఖలు చేసిన పిటిషన్‌లో.. క్రికెట్ మైదానాల నిర్వహణ కోసం భూగర్భ జలాలను వినియోగిస్తున్నారని, బదులుగా శుద్ధి చేసిన నీరు లేదా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వంటి ప్రత్యామ్నాయాలను ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. ఐపీఎల్ వంటి వాణిజ్య టోర్నీల సమయంలో కూడా భారీగా నీరు వినియోగిస్తున్నారని ఆయన ఆరోపించారు.ఈ కేసులో 2021 నుంచే ఎన్‌జీటీ విచారణ కొనసాగుతోంది. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా హెచ్‌సీఏ సమయానికి స్టేటస్ రిపోర్ట్ సమర్పించకపోవడంతో ఈ ఏడాది జనవరిలో ట్రైబ్యునల్ రూ.5 వేల జరిమానా విధించింది. అనంతరం హెచ్‌సీఏ జరిమానా చెల్లించి, సాంకేతిక వివరాలు సేకరించడం, నిపుణుల సలహాలు తీసుకోవడం వల్లే ఆలస్యమైందని వివరణ ఇచ్చింది

# కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య క్షుద్ర పూజల పంచాయితీ

హైదరాబాద్, ఆగస్టు 5 : నేటి కాలంలో కూడా బ్లాక్ మ్యాజిక్ నమ్ముతారా.. ఏవో శక్తులు ఉన్నాయంటే విశ్వసించాలా.. నిజంగానే.. దయ్యాలు.. ఉన్నాయా.. ఉంటే వాటికి పూజలు చేసి వశం చేసుకోవచ్చా.. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుతం పరిణామాలు దయ్యాలు.. క్షుద్ర పూజల చుట్టూ తిరుగుతున్నాయి.. ప్రస్తుతం మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉన్నాం. అరచేతులలో ప్రపంచం మొత్తాన్ని సులువుగా చూడగలుగుతున్నాం. ఏం జరిగిందో వెంటనే తెలుసుకోగలుగుతున్నాం. ఏం జరుగుతుందో కూడా అంచనా వేయగలుగుతున్నాం. ఇటువంటి కాలంలో క్షుద్ర పూజలు చేయడం ఏంటి.. ఎదుటివారి కీడును కోరుకునేందుకు పూజలు చేయడమేంటి.. వీటి ద్వారా అవన్నీ జరుగుతాయా.. అసలు అవన్నీ సాధ్యమేనాఇటీవల భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు పుణ్యక్షేత్రాలను సందర్శించారు. తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా.. ఇతర ప్రాంతాలలో ఉన్న ప్రఖ్యాతమైన క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ క్షేత్రాలను సందర్శించడం వెనక కారణం వేరే ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.. ముఖ్యంగా చిత్ర పూజలు చేయడానికి హరీష్ రావు వేరే ప్రాంతాలలో ఉన్న క్షేత్రాలను సందర్శించారని.. అక్కడ క్షుద్ర పూజలు కూడా చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఏకంగా విలేకరుల ముందుకు వచ్చి హరీష్ రావును తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక క్షుద్ర పూజలు చేశారని ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి నాయకులకు క్షుద్ర పూజలు చేయడం అలవాటేనని ఆయన పేర్కొన్నారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్లింది.. ఎవరిని కలిసింది.. కాంగ్రెస్




ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి ఏ తరహాలో వ్యవహరించింది అంతా తెలుసని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.మరోవైపు హరీష్ రావు మీద చేస్తున్న ఆరోపణల పట్ల ఆయన వర్గం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించిందని.. ప్రజలకు ఎటువంటి మంచి పనులు చేయకపోగా.. డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని హరీష్ వర్గం నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు మీద హరీష్ రావు లీగల్ నోటీసులు ఇచ్చారు. తాను క్షుద్ర పూజలు చేశానని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలని.. లేకపోతే పరువు నష్టం దావా ఎదుర్కోవాల్సి ఉంటుందని హరీష్‌రావు ఆ నోటీసులలో పేర్కొన్నారు. ఇటీవల కుటుంబంతో కలిసి హరీష్ రావు వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. అయితే ఆ పుణ్యక్షేత్రాల సందర్శన వెనక క్షుద్ర పూజలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. హరీష్‌రావు ఎన్ని రకాల పూజలు చేసినప్పటికీ గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని.. మళ్లీ కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని హస్తం నేతలు స్పష్టం చేస్తున్నారు.

# విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా...



**నెల్లూరు, ఆగస్టు 5 :** ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా చీలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు.దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్–జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్–జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో?సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట. యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట.ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి. అక్కడ మిగిలిన పార్టీలకు పెద్దగా పొలిటికల్ స్పేస్ ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో?.విజయసాయిరెడ్డి పార్టీకి ఎంతవరకు పొలిటికల్ స్పేస్ దొరుకుతుందో చూడాలంటున్నాయి పొలిటికల్ సర్కిల్స్.

# అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదా



**విజయవాడ,** ఆగస్టు 5 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్టుల పురోగతిపై ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. అమరావతి అంటే కేవలం 29 గ్రామాల సముదాయం మాత్రమే కాదు.. విజయవాడ, గుంటూరు నగరాలతో అనుసంధానమైన సమగ్ర బృహత్ రాజధాని ప్రాంతం అంటూ చంద్రబాబు ఇచ్చిన స్పష్టత, అమరావతి బ్రాండ్‌ను పునర్నిర్మించే వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోంది. విజయవాడ–గుంటూరు–అమరావతిలను కలిపి ఒక మెగా మెట్రోపాలిటన్ రీజియన్‌గా తీర్చిదిద్దడమే ఏపీ భవిష్యత్ ఆర్థిక, సామాజిక దిశను నిర్దేశించే అసలైన మాస్టర్ ప్లాన్ అని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.ఈ ప్రకటన వెనుక విస్తృతమైన రాజకీయ, నరేటివ్ పోరాటం దాగి ఉంది. గత కొద్దికాలంగా అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను తగ్గించేందుకు ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నిరంతరం కౌంటర్ నెరేటివ్‌ను నడుపుతోంది. జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చారు. మావిగన్‌లో మ అంటే మచిలిపట్నం..మిగతా రెండు విజయవాడ, గుంటూరు. ఇప్పుడు చంద్రబాబు చెప్పిన దాంట్లో మచిలీపట్నం లేదు. మిగతా అంతా సేమ్. మాది విజన్, మీది కేవలం 29 గ్రామాల రియల్ ఎస్టేట్ మోడల్ అని చిత్రీకరించే ప్రయత్నం చేయడం ద్వారా రాజధానిపై ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వైఎస్సార్సీపీ ప్రధాన రాజకీయ వ్యూహంగా మారింది. దీనికి చెక్ పెడుతూనే, సాధారణ ప్రజల్లో ఉన్న సంకోచాలను తొలగించేందుకు చంద్రబాబు ఈ త్రివేణీ సంగమం ఫార్ములాను తెరపైకి తెచ్చారు. కేవలం 29 గ్రామాలలోని కోర్ క్యాపిటల్ ఏరియానే రాజధానిగా ప్రచారం కావడం వల్ల రాయలసీమ, ఉత్తరాంధ్ర లేదా పల్నాడు ప్రజల్లో ఇది అందరి రాజధాని కాదు అనే భావన కలిగే ప్రమాదం ఉంది. అందుకే, విజయవాడ, గుంటూరు నగరాల ఆర్థిక వ్యవస్థను, మౌలిక వసతులను అమరావతితో ఐక్యపరిచి, 80 లక్షలకు పైగా జనాభాను కవర్ చేసే ఒక విశ్వనగరంగా డెవలప్ చేస్తామని చెప్పడం ద్వారా ఈ ప్రాజెక్టుకు ప్రాంతీయ ఆమోదాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.రూ.50,999 కోట్ల విలువైన 95 మౌలిక వసతుల ప్రాజెక్టులతో అమరావతిలో పనులు పునఃప్రారంభమైన వేళ, ప్రతినెల కనీసం 7.92 శాతం పురోగతి సాధించాలని చంద్రబాబు క్షేత్రస్థాయి అధికారులకు నిర్దేశించిన గడువు కేవలం నిర్మాణ వేగాన్ని సూచించడమే కాకుండా.. పనులను వేగవంతం చేసి స్పీడ్, క్వాలిటీ, డెలివరీ సూత్రంతో ప్రతిపక్షాల నోళ్లు మూయించాలనే పట్టుదలను ప్రతిబింబిస్తోంది. ప్రతిపక్షాలు ఇది సాధ్యం కాని కల, కేవలం భూముల ప్రకటనలు మాత్రమే అని విమర్శిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఇది అమరావతి విజన్ 2.0 అని గట్టిగా నమ్ముతోంది.మరోవైపు, వైఎస్సార్సీపీ ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. జగన్ చెప్పిన మావిగన్ రూట్‌లోకే చంద్రబాబు వస్తున్నారని జగన్ విజనరీ అంటున్నారు. ఇప్పుడు అమరావతి అంటే 29 గ్రామాలు కాదని, విజయవాడ–గుంటూరుతో పాటు మచిలీపట్నాన్ని కూడా కలపాల్సిందే అని వైసీపీ సోషల్ మీడియా విభాగాలు ప్రచారం వేగవంతం చేశాయి. అంటే ఎలా చూసినా అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీఆర్డీఏ గ్రామీణ పరిధులను, మచిలీపట్నం పోర్ట్ కనెక్టివిటీని తెరపైకి తెస్తూ.. అమరావతి నిర్మాణంలో జాప్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే చంద్రబాబు ఈ కొత్త మెట్రోపాలిటన్ డెఫినిషన్‌ను తెరపైకి తెచ్చారనేది వైసీపీ ప్రధాన ఆరోపణ. రాజధాని అమరావతి ప్రాంతం కేవలం భౌగోళిక నిర్మాణం కాక ఏపీ భవిష్యత్ ఆర్థిక ఇంజిన్ కాబోతుందా లేదా రాజకీయ వివాదాల నిలయంగా మిగిలిపోతుందా అనేది రాబోయే రెండేళ్లలో పనుల పురోగతి , పైనే ఆధారపడి ఉంటుంది.

# 205 మండలాల్లో దారుణ పరిస్థితులు..



ఏలూరు, ఆగస్టు 5 : ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు. కొన్ని జిల్లాల్లో తేలికపాటి వానలు మినహా పెద్దగా వర్షాలు ఎక్కడా పడలేదు. దీంతో రాష్ట్రంలోని 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.. ఇటు రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా దారుణంగా తగ్గిపోయింది.ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు కష్టాలు మొదలయ్యాయి.. ఖరీఫ్ మొదలై రెండు నెలలు గడిచినా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 3 వరకు చూస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 50.80శాతం తక్కువ వానలు పడ్డాయి. అలాగే రాష్ట్రంలో పంటలు కూడా సాధారణ విస్తీర్ణంలో 43% మాత్రమే సాగయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.8 డిగ్రీలు నమోదైందంటే పరిస్థితి ఎలా అర్థం చేసుకోవచ్చు. వచ్చే మూడు నెలల్లోనూ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు మాత్రమే పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో 6 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనా సరే పరిస్థితి ఏమాత్రం మారలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 73.50శాతం లోటు వర్షపాతం నమోదైంది. విశాఖపట్నం జిల్లాలో సాధారణం కంటే 66.80శాతం, చిత్తూరు జిల్లాలో 63.50శాతం, ప్రకాశం జిల్లాలో 59.70శాతం, కడప జిల్లాలో 59.20శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 57.60శాతం, శ్రీకాకుళం జిల్లాలో 57.20శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 53.60శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 50.90శాతం, మార్కాపురం జిల్లాలో 50.20శాతం తక్కువ వర్షాలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 397 మండలాల్లో లోటు వర్షపాతం.. 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి.ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 77 లక్షల ఎకరాలు ఉంటే.. ఇప్పటి వరకు 33.29 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి నాట్లు 38 ఎకరాల్లో వేయాల్సి ఉంటే.. కేవలం 15 లక్షల ఎకరాలకు పరిమితం అయ్యింది. కంది 7.50 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. 3.60 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. వేరుశనగ 9.67 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. అది కేవలం 2.27 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంతేకాదు చిత్తూరు జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో 88శాతం.. అనంతపురం జిల్లాలో 87శాతం, నంద్యాల జిల్లాలో 56శాతం సాగు విస్తీర్ణం తగ్గింది

# మూగబోయిన ఫైర్ బ్రాండ్స్



**విజయవాడ,** ఆగస్టు 5 :2024 ఎన్నికల ఓటమి అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం ఊహించని మలుపు తిరిగింది. గతంలో ప్రత్యర్థిపార్టీల నేతలపై నిమిషానికో రీతిలో విరుచుకుపడే ఫైర్ బ్రాండ్ నాయకులు ఆర్.కే. రోజా, కొడాలి నాని, జోగి రమేష్, వల్లభనేని వంశీ వంటి కీలక నేతలు రాజకీయంగా పూర్తిగా మౌనం వహించారు. ఎన్నికలు ముగిసి రెండేళ్లు దాటిపోయినా వీరు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనకపోవడం, మీడియా ముందుకు రాకపోవడం కేడర్‌లో తీవ్ర నిరాశను నింపుతోంది. ప్రస్తుతం కేవలం పేర్ని నాని, అంబటి రాంబాబు వంటి కొద్దిమంది నాయకులు మాత్రమే మైకుల ముందుకు వచ్చి ప్రత్యర్థులపై ఎదురుదాడి చేస్తున్నారు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నమోదైన వరుస కేసులు, చట్టపరమైన చర్యల భయంతో స్లో అయ్యారు. జోగి రమేష్ పై సిఐడి కేసులు, అగ్రిగోల్డ్ భూ వివాదం, తాజాగా కుటుంబం కేసులు కూడా వచ్చి పడ్డాయి. అలాగే వల్లభనేని వంశీ చాలా రోజులు జైల్లో ఉండి వచ్చారు. కొడాలి నాని అనారోగ్యం, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అసలు గుడివాడలోనే కనిపించడంలేదు. ఐదేళ్ల పాలనలో వ్యక్తిగత దూషణలతో తీవ్ర స్థాయి విమర్శలు చేసిన ఈ నేతలు, ఇప్పుడు అధికార పక్షం కఠినంగా వ్యవహరిస్తుండటంతో చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకునేందుకు తాత్కాలికంగా రక్షణాత్మక వైఖరి లోకి వెళ్లిపోయారనేది స్పష్టమవుతోంది.మరోవైపు, ప్రతిపక్షంలో ఉన్న ఈ సమయంలో తీవ్రంగా విరుచుకుపడే నాయకులు మీడియా ముందు రాకపోతే పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రాదనేది పక్కా వాస్తవం. జగన్ మోహన్ రెడ్డి సైతం క్షేత్రస్థాయికి వచ్చి నిరసనలకు పిలుపునిస్తున్నా, దూకుడైన నేతల నాయకత్వం లేకపోవడం వల్ల ఆందోళనలు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నాయి. పేర్ని నాని, అంబటి రాంబాబులు ఒంటరి పోరాటం చేస్తున్నప్పటికీ, రాయలసీమ నుంచి రోజా, కృష్ణా జిల్లా నుంచి కొడాలి నాని, వంశీ, జోగి రమేష్ వంటి వారు జతకలిస్తేనే పార్టీ కేడర్‌లో పూర్వ వైభవం, మైలేజ్ లభిస్తాయని వైఎస్సార్సీపీ శ్రేణులు భావిస్తున్నాయి.అయితే, వీళ్లను జగన్ ఎప్పుడు యాక్టివ్ చేస్తారు? లేదా వారే స్వయంగా బయటకు వస్తారా? అనే ప్రశ్నలకు పార్టీ వ్యూహకర్తల నుంచి భిన్నమైన సమాధానాలు వస్తున్నాయి. ఎన్నికలకు ముందు అధికారంలో ఉన్నప్పుడు చేసిన విమర్శల వల్లే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని భావిస్తున్న జగన్, ప్రస్తుతానికి కొత్త డెసిషన్ తీసుకునే ముందు కొంత సమయం ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా, ప్రభుత్వం విధించే చట్టపరమైన సవాళ్లు , కేసుల తీవ్రత కొంత తగ్గిన తర్వాతే లేదా స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి వీరిని మళ్లీ ముందువరుసలోకి తెచ్చేలా వ్యూహం రచిస్తున్నారని సమాచారం. అందుకే వారు వారి వారి నియోజకవర్గాల్లో పెద్దగా పార్టీ వ్యవహారాలను పట్టించుకోకపోయినా .. లైట్ తీసుకుంటున్నారని అంటున్నారు.వైఎస్సార్సీపీ తిరిగి పుంజుకోవాలంటే కేవలం జగన్ ఓరల్ ప్రసంగాలు సరిపోవు. క్షేత్రస్థాయిలో కౌంటర్ ఇవ్వగలిగే బలమైన గొంతులు మళ్లీ ప్రజా క్షేత్రంలోకి రావడం అత్యంత అవసరం. ఈ నేతలు తమ వ్యక్తిగత, న్యాయపరమైన సవాళ్లను దాటుకుని ధైర్యంగా ముందుకు వస్తే తప్ప వైఎస్సార్సీపీ కేడర్‌లో కోల్పోయిన ఆత్మవిశ్వాసం తిరిగొచ్చే అవకాశం లేదు. మరి దానికి జగన్ ఏం చేయబోతున్నారో

# వైసీపీలో సాహూ ఆన్ డ్యూటీ..

**విజయవాడ, ఆగస్టు 5 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ వచ్చే ఎన్నికలలో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తను మార్చినట్లు తెలిసింది. కపిల్ సాహూను ఆయన నియమించుకున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జగన్ పర్యటనలను డిజైన్ చేయడంతో పాటు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నివేదికలను కపిల్ సాహు టీం జగన్ కు అందిస్తున్నట్లు సమాచారం. అందుకే జగన్ ఈసారి ఎన్నికల్లో తమదే గెలుపు అన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. కపిల్ సాహు టీం ఇప్పటికే ఏపీ రాజకీయాలపై ఫోకస్ పెట్టిందని అంటున్నారు. జగన్ ఎక్కడకు వెళ్లినా విపరీతమైన జనం రావడం, టూర్ ఆలస్యమవ్వడం వ్యూహకర్త వ్యూహంలో భాగమేనని అంటున్నారు. అయితే ఈ పేరు అధికారికంగా బయటకు రాకపోయినా అనధికారికంగా కపిల్ సాహు డ్యూటీలోకి దిగినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. టీవీకే అధినేత విజయ్ ఎన్నికల వ్యూహకర్త గా కపిల్ సాహు వ్యవహరించారు. ఆయన ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బృందంలో పనిచేసి, ఆ తర్వాత సొంతంగా 'పొలిటికల్ కన్సల్టింగ్ డొమైన్' అనే సంస్థను ఏర్పాటు చేసి విజయ్ పార్టీ టీవీకే విజయం కోసం పనిచేశారు. తొలిసారి విజయ్ ను ముఖ్యమంత్రి పీఠం పై కూర్చోబెట్టడంలో కపిల్ సాహు కీలకంగా వ్యవహరించారు. తక్కువ సీట్లు వచ్చినప్పటికీ కపిల్ సాహు టీం సోషల్ మీడియాలో డ్రైవ్ చేయడం, విజయ్ కు అనుకూలంగా మార్చడంలో సక్సెస్ అయ్యారు. ఇదే విషయాన్ని వైసీపీ అధినేత జగన్ గుర్తించి ఆయనను తనకు 2029 ఎన్నికల వ్యూహకర్తగా ఉండాలని కోరినట్లు తెలిసింది. దీంతోకపిల్ సాహు ఇందుకు అంగీకరించినట్లు తెలసింది. ఇప్పటికే కపిల్ సాహు టీం జగన్ వ్యవహారాలను పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతతిన్నాయి. ప్రశాంత్ కిషోర్ సంస్థ ఐ ప్యాక్ లో పనిచేసిన అనుభవంతో,డాటా విశ్లేషణ, ప్రచార ప్రణాళికలు రూపొందించడంలో కపిల్ సాహు టీంకు మంచి పేరు ఉండటంతో జగన్ దృష్టిలో పడ్డారు. తనకు ప్రధాన మీడియా వ్యతిరేకం కావడం, డిజిటల్ ప్రచారంపై ఎక్కువగా ఆధారపడి రావాల్సి ఉండటంతో జగన్ కపిల్ సాహును ఎన్నికల వ్యూహకర్తగా ఎంచుకున్నారంటునానారు. తాను నేరుగా ఎక్కువ మీడియా సమావేశాల్లో పాల్గొనకపోయినా, సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి వెళ్లేలా పటిష్టమైన వ్యూహాన్ని అమలు చేయడం, సంక్షోభ సమయాల్లో సమన్వయం, ప్రచార సరళిని నిర్వర్తించడంలో కపిల్ సాహు బృందం కీలక పాత్ర పోషించనుందని చెబుతున్నారు. మరి కపిల్ సాహు ఎంత మేరకు సక్సెస్ అవుతారో చూడాలి.

# వైసీపీ సీనియర్లలో అసంతృప్తులు



**నెల్లూరు, ఆగస్టు 5 :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎటు వెళ్తుందో తెలియడం లేదు. ఆ పార్టీ సీనియర్లలో ఆందోళన అదే. ప్రజా పోరాటాలు చేయడం లేదు. ప్రజా ఆందోళనలు నిర్వహించడం లేదు.. జాతీయస్థాయిలో జరుగుతున్న పెద్ద ఉద్యమాలకు మద్దతు తెలపడం లేదు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చుట్టూ వివాదాలు, కేసులు నడుస్తున్నాయి. అలాగని గత ప్రభుత్వ హయాంలో జరిగిన కేసులు కావు. ఇందులో నేరుగా కూటమి ప్రభుత్వం కలుగజేసుకోవడం లేదు. కానీ ఒక్క వైసీపీ నేతపై కేసు నమోదు అవుతుంది. అరెస్టుల పర్వం నడుస్తోంది. దీనిపైనే వైసీపీలో సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. వ్యక్తిగత వ్యవహార శైలితో పార్టీని కొంతమంది నేతలు డ్యామేజ్ చేస్తున్నారన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. ఇది పార్టీ పై ప్రతికూలత చూపుతోందన్న ఆవేదన సీనియర్లలో ఉంది. ఇన్ని రోజులు అధినేత జగన్మోహన్ రెడ్డి ఏం చేసినా ఊరుకున్నామని.. ఇకనుంచి ఊరుకోబోమని వారు చెబుతున్నారు. హెచ్చరించినంత పని చేస్తున్నారు.కొద్ది రోజుల కిందట సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పార్టీలోనే పవర్ఫుల్ నేత ఆయన. మరి ఎందుకు ఆ స్థాయిలో మాట్లాడడం లేదు అని రిపోర్టర్ ప్రశ్నించేసరికి పెద్దిరెడ్డి వింత సమాధానం చెప్పారు. తమ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆవేదనతో సంకేతాలు ఇచ్చారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని.. తాను అటువంటిదే కోరుకుంటానని.. తమ పార్టీ నేత అంబటి రాంబాబు లా మాట్లాడను అంటూ చురకలు అంటించారు. అయితే అది అంబటి రాంబాబు నువ్వు ఉద్దేశించింది కాదు. తెర వెనుక జగన్ వైఖరిని తప్పు పట్టడమే దాని ముఖ్య ఉద్దేశం. ఒక్క పెద్దిరెడ్డి మాత్రమే కాదు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు లాంటి సీనియర్ నేతలు వైసీపీలో అనవసర వ్యాఖ్యలు చేసే నాయకుల వైఖరిని తప్పుపడుతున్నట్లు తెలుస్తోంది.మొన్నటి వరకు కూటమి ప్రభుత్వం పాత కేసులను తెరపైకి తెచ్చి వెంటాడింది అని వైసిపి ఆరోపించింది. కానీ ఇప్పుడు ఒక్కో నేత అరెస్టు తీరు చూస్తే మాత్రం భిన్నంగా ఉంది. కేసులు నమోదు కావడం వెనుక చూస్తుంటే వ్యక్తిగత వ్యవహార శైలి కనిపిస్తోంది. మాజీ మంత్రి అప్పలరాజు వ్యవహరించిన తీరుతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. తన కుమారుడు బైక్ రైటింగ్ కారణంగా ఓ మనిషి ప్రమాదానికి గురయ్యారు. కానీ అది తన కొడుకు మెడకు చుట్టుకోకుండా మరో వ్యక్తిని బలిపశువు చేయడానికి చూశారు. దానిని కూడా సక్రమంగా హ్యాండిల్ చేయలేకపోయారు. చివరకు ఆయన అరెస్టు కూడా జరిగిపోయింది. పార్టీకి డ్యామేజ్ మిగిల్చింది. తమ్మినేని సీతారాం గురించి అయితే చెప్పనవసరం లేదు. స్పీకర్ గా ఉంటూనే ఒక భూమి యజమాని బతికుండగానే ఆయన వారసుల పేరుతో నకిలీ ధ్రుపత్రాలు సృష్టించి.. తన కుమారుడి పేరుతో నాలుగు కోట్ల విలువైన భూమిని రాయించుకున్నారు.. సామాన్యులు సైతం దీనిని తప్పుపడుతున్నారు.తాజాగా మాజీ మంత్రి జోగి రమేష్ ఫ్యామిలీ కేసుల బారిన పడింది. జోగి రమేష్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులు 11 మందిపై కోడలు మేఘన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు కట్నం, గృహహింస, హత్యాయత్నం వంటి ఆరోపణలు చేస్తూ ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీంతో జోగి రమేష్ ఫ్యామిలీ కేసుల బారిన పడింది. వీటిని రాజకీయ కక్ష్యలో చూపించే ప్రయత్నం జరుగుతోంది. కానీ ఇది వ్యక్తిగత కేసులు అన్నది ప్రజలకు తెలుసు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజా పోరాటాలు చెయ్యకపోగా ఇలా వ్యక్తిగత వైఖరితో పార్టీని డ్యామేజ్ చేస్తున్నారు అనేది సీనియర్ల అభిప్రాయం. అంతకుమించి జగన్ వారిని వెనుకేసుకు రావడం పై కూడా పార్టీలో భిన్న స్వరం వినిపిస్తోంది. ఇక తేల్చుకోవాల్సింది జగన్మోహన్ రెడ్డి మాత్రమే.

# వీర మహిళలకు పెద్ద పీట....

**కాకినాడ, ఆగస్టు 5 :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమైన సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అనేక జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు నాయకత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయకపోవడంతో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పార్టీ కార్యవర్గాన్ని అప్పట్లో రద్దు చేశారు. ఇప్పుడు దాదాపు అన్ని పదవులు రద్దయ్యాయి. అలాగే పార్టీ అధికార ప్రతినిధులుగా మహిళలకే చోట కల్పించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి

## వారానికి ఓ పాలి.. ఇక నీకు తిరుగుండదోయి..



కరివేపాకు సాధారణంగా మనం కూరల నుండి తీసి పక్కన పెట్టేస్తుంటాం. కానీ అదే కరివేపాకుతో అద్భుతమైన రుచికరమైన, ఆరోగ్యకరమైన పులుసును సులభంగా తయారు చేసుకోవచ్చు. కంటి చూపు మెరుగుపరచడం, జుట్టు ఆరోగ్యానికి, రక్తాన్ని శుద్ధి చేయడానికి కరివేపాకు ఎంతో మేలు చేస్తుంది. ఈ వంటకం వారానికి ఒకసారైనా తింటే పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. మనం ప్రతిరోజూ వండుకునే కూరల్లో అద్భుతమైన రుచిని, సువాసనను అందించే కరివేపాకును చాలామంది తినేటప్పుడు తీసి పక్కన పెట్టేస్తుంటారు. అయితే, ఈ కరివేపాకు కేవలం రుచి కోసమే కాకుండా, మన ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. కంటి చూపు మెరుగుపరచడం నుండి జుట్టు కుదుళ్లను బలోపేతం చేయడం వరకు, శరీరంలోని మలినాలను పోగొట్టి రక్తాన్ని శుద్ధి చేసే అద్భుతమైన శక్తి కరివేపాకుకు ఉంది.

కావలసిన పదార్థాలు: కరివేపాకు – 2 కప్పులు, నూనె – సరిపడినంత, ఆవాలు – అర స్పూన్, జీలకర్ర – పావు స్పూన్, ఎండుమిర్చి – 1, వెల్లుల్లి రెబ్బలు – గుప్పెడు, పచ్చిమిర్చి – 2–3 (ముక్కలు), ఉల్లిపాయలు – 4 (సన్నగా తరిగినవి), ఉప్పు – రుచికి సరిపడా, పసుపు –కొద్దిగా, కారం – 2 స్పూన్లు (తినే కారాన్ని బట్టి), బెల్లం – చిన్న ముక్క, చింతపండు రసం – నిమ్మకాయ సైజంత చింతపండు నుండి తీసినది, నీళ్ళు ? సరిపడినంత

తయారీ విధానం: 1. కరివేపాకు వేయించడం: ముందుగా స్టవ్ మీద కడాయి పెట్టి, రెండు మూడు స్పూన్ల నూనె వేసి వేడి చేయాలి. నూనె కాగిన తర్వాత కడిగి, తడి లేకుండా ఆరబెట్టిన రెండు కప్పుల కరివేపాకు వేసుకోవాలి. మంటను మీడియం ఫ్లేమ్ లో ఉంచి, కరివేపాకు క్రిస్పీగా అయ్యేంత వరకు కలుపుతూ వేయించాలి. సరిపడినంత నూనె వేసుకోవడం ముఖ్యం. వేగిన కరివేపాకును నూనె రాకుండా ఒక గిన్నెలోకి తీసుకుని, పూర్తిగా చల్లారిన తర్వాత మిక్సీ జార్ లో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. రోట్లో వేసుకున్నా బాగా మెత్తగా రుబ్బుకోవచ్చు. 2. పోపు తయారీ: కరివేపాకు వేయించిన నూనెలో కూరకి సరిపడినంత నూనె అదనంగా వేసుకోవాలి. నూనె కాగిన తర్వాత అర స్పూన్ ఆవాలు, పావు స్పూన్ జీలకర్ర, ఒక ఎండుమిర్చి వేసి ఒకసారి కలిపి, తొక్కలు వలిచిన గుప్పెడు వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. వెల్లుల్లి ఇష్టం లేని వారు స్కిప్ చేయవచ్చు. ఇవి వేగిన తర్వాత రెండు మూడు పచ్చిమిర్చిల ముక్కలు, సన్నగా తరిగిన నాలుగు ఉల్లిపాయల ముక్కలు వేసి రుచికి సరిపడా ఉప్పు కూడా కలపాలి.

# ఈ స్నాక్‌తో పిల్లలకు ఐరన్, కాల్షియం కొండంత బలం!



మన పూర్వీకులు రాగులతో చేసిన వంటకాలను ఎక్కువగా తీసుకోవడం వల్లే ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా ఉండేవారు. ఈ మధ్యకాలంలో జనాల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి మళ్లీ సిరిధాన్యాల వాడకం పెరిగింది.

ముఖ్యంగా మహిళల్లో వచ్చే రక్తహీనత, ఎముకల బలహీనత వంటి సమస్యలకు రాగులు ఒక సంజీవనిలా పనిచేస్తాయని పెద్దలు చెబుతున్నారు. మరి అంతటి పోషక విలువలున్న రాగి పిండితో ఎప్పుడూ ఒకే లాంటి టిఫిన్స్ తింటే బోర్ కొడుతుంది కదా. అందుకే ఎప్పటిలాగా రాగి దోసా, రోటీ, సంకటి లాంటివి కాకుండా కేవలం కొద్ది నిమిషాల్లోనే ఎంతో రుచికరమైన రాగి చెక్కలను ఎలా చేసుకోవాలో ఈ స్పెషల్ స్టోరీలో తెలుసుకుందాం? కావలసిన పదార్థాలు: రాగి పిండి/ బియ్యం పిండి (చెక్కలు క్రిస్పీగా రావడం కోసం)/ వేరుశెనగ పప్పులు (కొద్దిగా కచ్చాపచ్చాగా దంచినవి)/ నువ్వులు/ పచ్చిమిర్చి, అల్లం పేస్ట్/ కరివేపాకు, కొత్తిమీర తరుగు/ ఉప్పు (తగినంత)/ వెన్న లేదా వేడి నూనె (పిండి కలుపుకోవడానికి)/ డీప్ ఫ్రైకి సరిపడా నూనె తయారీ విధానం.. ముందుగా ఒక వెడల్పాటి గిన్నెలో రాగి పిండి, కొద్దిగా బియ్యం పిండి తీసుకోండి. అందులో నువ్వులు, కచ్చాపచ్చాగా దంచిన వేరుశెనగ పప్పులు, తగినంత ఉప్పు వేసి బాగా కలుపుకోండి. తర్వాత ఈ మిశ్రమంలో పచ్చిమిర్చి–అల్లం పేస్ట్, సన్నగా తరిగిన కరివేపాకు, కొత్తిమీర వేయండి. చెక్కలు సాఫ్ట్‌గా, క్రిస్పీగా రావడం కోసం కొద్దిగా వెన్న లేదా వేడి నూనె వేసి పిండిని బాగా ముద్దలా కాకుండా పొడిపొడిగా కలుపుకోవాలి. ఇప్పుడు కొద్దికొద్దిగా గోరువెచ్చని నీటిని పోస్తూ, చపాతీ పిండి కంటే కొంచెం గట్టిగా (మరీ జారుడుగా కాకుండా) ముద్దలా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. అలా పక్కన పెట్టుకున్న పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ కవర్ లేదా బట్టర్ పేపర్‌పై కొద్దిగా నూనె రాసి, ఈ ఉండలను చేత్తో పలచని చెక్కల్లా ఒత్తుకోవాలి. ఆపై కాగుతున్న నూనెలో వేసి రెండు వైపులా చక్కగా కాలే వరకు మీడియం ఫ్లేమ్‌పై డీప్ ఫ్రై చేయాలి. అంతే ఆరోగ్యకరమైన రాగి చెక్కలు రెడీ.

# మద్యం కాలేయానికే కాదు.. మెదడుకూ ముప్పే..!



మద్యం సేవించడం వల్ల కాలేయం, గుండెకు మాత్రమే నష్టం జరుగుతుందని చాలామంది భావిస్తుంటారు. అయితే, మద్యం ప్రభావం మెదడుపైనా తీవ్రంగా పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తరచూ లేదా అధికంగా మద్యం సేవించడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, నిద్ర నాణ్యత వంటి మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతుందని న్యూరాలజిస్టులు చెబుతున్నారు.

మెదడులో జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యానికి కీలకమైన హిప్పోక్యాంపస్‌పై మద్యం మొదట ప్రభావం చూపుతుంది. దీని వల్ల తాత్కాలిక జ్ఞాపకాలను దీర్ఘకాలిక జ్ఞాపకాలుగా మార్చే ప్రక్రియ దెబ్బతింటుంది. ఫలితంగా ఎక్కువ మద్యం సేవించినప్పుడు కొందరికి 'బ్లాక్అవుట్స్' ఏర్పడి, ఆ సమయంలో జరిగిన విషయాలు పూర్తిగా గుర్తు లేకపోవచ్చు. అంతేకాదు.. మద్యం జ్ఞాపకశక్తినే కాకుండా మెదడులోని ఫ్రంటల్ లోబ్‌పై కూడా ప్రభావం చూపుతుంది. ఈ భాగం ఏకాగ్రత, ప్రణాళిక, సరైన నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాలను నియంత్రించడం వంటి కీలక పనులను నిర్వహిస్తుంది. మద్యం ఎక్కువగా తీసుకునేవారికి సంభాషణలను అర్థం చేసుకోవడం, పేర్లు గుర్తుంచుకోవడం, సమస్యలను పరిష్కరించడం వంటి పనులు క్రమంగా కష్టమవుతాయి.

మద్యం తాగితే బాగా నిద్రపడుతుందని చాలామంది అనుకుంటారు. కానీ అది కేవలం తాత్కాలిక మత్తును మాత్రమే కలిగిస్తుంది.


## బాదం పప్పుతో మధుమేహానికి చెక్..!



భారతదేశంలో మధుమేహం బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ ఆందోళనకరంగా పెరుగుతోంది. బ్లడ్ షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి మందులతో పాటు మనం తీసుకునే ఆహార నియమాలు కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్‌కు ముందు తీసుకునే ఆహారం రోజంతా మన జీవక్రియలను ప్రభావితం చేస్తుంది. అందుకే, డయాబెటిస్ ఉన్నవారు ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో నానబెట్టిన బాదంపప్పులను తినాలని వైద్యులు మరియు పోషకాహార నిపుణులు బలంగా సిఫార్సు చేస్తున్నారు. ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది:

బాదంలో మెగ్నీషియం ఖనిజం పుష్కలంగా ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారిలో చాలా మందికి మెగ్నీషియం లోపం ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. శరీరంలో తగినంత మెగ్నీషియం ఉంటే, అది ఇన్సులిన్ హార్మోన్ కణాల్లోకి గ్లూకోజ్‌ను పంపే ప్రక్రియను సులభతరం చేస్తుంది. అంటే బాదం తినడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా వాడుకుంటుంది. షుగర్ స్పైక్స్‌ను అడ్డుకుంటుంది: బాదంపప్పులలో కార్బోహైడ్రేట్లు చాలా తక్కువగా ఉండి, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఉదయాన్నే పరగడుపున వీటిని తినడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది.

## 'ది ఇండియా స్టోరీ' కథ విన్నాక రాత్రిళ్లు నిద్రపట్టలేదు



ఆహార కల్తీ.. ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సమస్య. ఇదే కథాంశంతో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ది ఇండియా స్టోరీ' . చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ కోర్ట్‌రూమ్ డ్రామాలో నటి కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా స్క్రిప్ట్ తనను మానసికంగా తీవ్రంగా కలచివేసిందని, దేశంలో ఆహార కల్తీ వాస్తవాలు తెలిసి రాత్రిళ్లు నిద్ర కూడా పట్టలేదని కాజల్ తాజాగా వెల్లడించారు. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ సినిమా గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ఈ సినిమా కథ వినగానే నేను షాక్ అయ్యాను. భయంతో కొన్ని రాత్రిళ్లు నాకు నిద్రపట్టలేదు. మనం ఏం తింటున్నాం? మన కుటుంబాల పరిస్థితి ఏంటి? ఈ కల్తీని ఎలా ఎదుర్కోవాలి?

# సెప్టెంబర్ 3న 'రోమాంచకం' రిలీజ్



భద్రకాళీ పిక్చర్స్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో ఇప్పటికే భారీ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్స్ వచ్చాయి. ఈ కాంబోలో ఓ ఫ్రెష్ లవ్ స్టోరీతో 'రోమాంచకం' సినిమా రానుంది. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా సమర్పిస్తుండగా, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఆడియెన్స్ ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ సినిమా సెప్టెంబర్ 3న రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ డీవోపీ పవన్ పప్పుల అందించిన పెయింటింగ్ లాంటి బ్యూటిఫుల్ విజువల్స్ తో , వాసుకి వైభవ్ కంపోజ్ చేసిన స్వీట్ మెలొడియస్ ట్యూన్ తో సాగుతూ హీరోయిన్స్ మధ్య ఉన్న ప్రేమను, వారి మధ్య ఏర్పడిన దూరాన్ని చూపిస్తూ సాగింది.

ఈ సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు వస్తోంది. సుమంత్ ప్రభాస్, అనంతిక జంట కెమిస్ట్రీ ఈ సినిమాకు హైలైట్ గా నిలుస్తోంది. ఈ సినిమా ఒక ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా రూపొందుతోంది.

# 'బేబి 2' పై అప్డేట్ ఇచ్చిన ఎస్‌కేఎన్

తెలుగు సినిమా పరిశ్రమలో ప్రముఖ నిర్మాతగా గుర్తింపు పొందిన వారిలో ఎస్‌కేఎన్ ఒకరు. తాజాగా ఆయన నిర్మించిన 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో కిరణ్ అబ్బవరం హీరోగా, శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమా జూలై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్‌కేఎన్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా, "మీరు కొంతకాలం క్రితం నిర్మించిన 'బేబీ' సినిమా ఘన విజయం సాధించింది. ఆ చిత్రానికి సీక్వెల్ రూపొందించే ఆలోచన ఉందా?" అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీనికి ఎస్‌కేఎన్ స్పందిస్తూ.. "'బేబీ' చిత్రానికి దర్శకత్వం వహించిన సాయి రాజేష్ వల్లే ఆ సినిమా అంతటి విజయాన్ని అందుకుంది. ఆ చిత్రానికి సంబంధించిన ప్రతి విషయంలోనూ ఆయనదే కీలక పాత్ర. సీక్వెల్ విషయంలో కూడా తుది నిర్ణయం పూర్తిగా సాయి రాజేష్‌దే. ఆయనకు సీక్వెల్ చేయాలనే ఆసక్తి ఉంటే తప్పకుండా చేస్తాం. లేదంటే చేయం. ప్రస్తుతం అయితే అలాంటి ఆలోచన ఏదీ లేదు" అని స్పష్టం చేశారు. కాగా కొంతకాలం క్రితం విడుదలైన 'బేబీ' చిత్రంలో ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటించగా, వైష్ణవి చైతన్య కథానాయికగా మెప్పించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించి, భారీ వసూళ్లను రాబట్టింది.

# సరికొత్తగా 'పీఆర్ షో'



రచయితగా, దర్శకుడిగా, హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రదీప్ రంగనాథన్ ఇప్పుడు నిర్మాతగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నారు. 'పీఆర్ షో' పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఈ బ్యానర్‌లో తొలి సినిమాగా, డ్యూడ్ సినిమాలో ఆయనతో కలిసి నటించిన మమిత బైజు, దర్శకుడు అశ్వత్ మారిముత్తు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో శివాజీ సొంటినేని, స్వాసిక, అనామిక మహి, లిజ్జీ ఆంటోని కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను స్టైలిష్ అనౌన్స్‌మెంట్ వీడియోతో అధికారికంగా ప్రకటించారు. ఇందులో నటీనటులు, టెక్నికల్ టీమ్‌ను ఆసక్తికరంగా పరిచయం చేశారు. ఈ సినిమాకు కథను ప్రదీప్ రంగనాథన్ అందించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు కూడా చేపట్టారు. ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను ది ఆల్ఫా యూనిట్ పేరుతో పరిచయం చేసిన ఆరుగురు సభ్యుల బృందం నిర్వహిస్తోంది. ఇందులో విశాల్ టీఆర్, యష్ వి, నరేన్ సౌదా, చాణక్యన్ ఆర్, ధనుష్ కుమార్, ఇళంపరితి ఉన్నారు. ఒకే సినిమాకు ఆరుగురు కలిసి దర్శకత్వం వహించడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

## ఒకేసారి మూడు పాన్ ఇండియా సినిమాలు...



కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి 'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా ఫుల్ పాపులారిటీ రాబట్టుకున్నారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు సాధించి అప్పట్లో పెద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వచ్చిన ప్రీక్వెల్ 'కాంతార: చాప్టర్ 1' కూడా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ సినిమాల్లో నటించడంతో పాటు స్వయంగా ఆయనే దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఓ మూడు పాన్ ఇండియా చిత్రాలతో ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రిషబ్ శెట్టి.. త్వరలో తను చేయబోయే మూడు భారీ సినిమాలకు సంబంధించిన ఆసక్తికరమైన వివరాలను పంచుకున్నారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com